క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
5-11-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:228

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

అమరవీరుల కాలనీపై రగడ!



తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు సంబంధించి ఇళ్ల నిర్మాణం పై మరోసారి రాజకీయ రగడ ప్రారంభం అయింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష గులాబీ పార్టీ మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఎర్రవల్లి లోని కెసిఆర్ ఫామ్ హౌస్ సమీపంలో.. అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక కాలనీ ఇల్లు కేటాయిస్తామంటూ సీఎం రేవంత్ ప్రకటన చేశారు. దీనిపై కేటీఆర్ స్పందించారు.. ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద కడతామంటూ సీఎం రేవంత్ ప్రకటన



ఎవడబ్బ సొమ్ము అంటూ కేటీఆర్ రియాక్షన్

మియాపూర్ భూముల్లో కట్టాలని సూచన


కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో ఎదురుదాడి

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో : ఫామ్ హౌస్ వద్ద కాదు.. దమ్ముంటే ప్రభుత్వం వేలం వేయాలని చూస్తున్న మియాపూర్ భూముల్లో.. అమరవీరులకు, ఉద్యమకారులకు ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎవరబ్బ సొమ్మని

- మిగతా 2వ పేజీలో

యధావిధిగా ప్రాదేశిక ఎన్నికలు!

- నేడు ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికల పోలింగ్
- ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రక్రియ
- ఈనెల 7న లెక్కింపు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం





చిన్న శ్రీనుకు షాక్!

- జడ్పీటిసి బరిలో ఆయన కుమార్తె సిరి సహస్ర
- ఇంతలోనే హైకోర్టు కీలక ఆదేశాలు
- బీసీ ప్రయోజనాలకు బ్రేక్
- రేపే ఎన్నికల పోలింగ్.. పోటీపై సందిగ్ధత

- మిగతా 2వ పేజీలో

'సదర్' తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక

యాదవులకు కీలక హామీలు

- సదర్‌ను అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం
- వేడుకల నిర్వహణకు రూ.5 కోట్ల నిధులు కేటాయింపు
- హైదరాబాద్‌లోని గోల్కొండ ఒకనాటి గొల్లంకొండ అని రేవంత్ వ్యాఖ్య





సదర్ సమ్మేళనం యాదవులకే కాదని, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఆత్మగౌరవ ప్రతీక అని..ఇది అద్భుతమైన కార్యక్రమమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదవుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారికి తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

రాష్ట్రంలో తాము కులగణన చేసి చూపించామని, తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరించేలా కులగణన నిర్వహించామన్నారు. మూసీ అభివృద్ధి, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాల్సిన

- మిగతా 2వ పేజీలో

ఓటు చోరీపై పార్లమెంట్లో చర్చ!


ప్రత్యేక సమావేశాలు పెట్టేందుకు బిజెపి నిర్ణయం

సీఈసీ జ్ఞానేశ్వర్ రాజీనామా తరువాత అంటున్న కాంగ్రెస్



క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్: ఓటు చోరీ పై జాతీయస్థాయిలో కాంగ్రెస్ ఉద్యమిస్తోంది. ఓటర్ల సమగ్ర నమోదు ప్రత్యేక సవరణ ద్వారా దేశవ్యాప్తంగా

మిగతా 3,లో



అప్రూవ్డ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు లైన్ క్లియర్!

22 ఏ, నాన్ నాలా సమస్యకు మోక్షం

రాష్ట్రవ్యాప్తంగా 240కి పైగా కాలనీలు, లే అవుట్ లకు విముక్తి

తెలంగాణ ప్రభుత్వ సంచలన నిర్ణయం

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఓపెన్ ప్లాట్లు, ఇల్లు కొనుగోలు చేసి యాళ్ల తరబడి నిషేధిత జాబితా చిక్కుముడులో పడి.. తీవ్ర ఇబ్బందులు పడుతున్న లక్షలాదిమంది సామాన్యులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రభుత్వం

- మిగతా 2వ పేజీలో

డోనాల్డ్ ట్రంప్‌కు షాక్!

మిడ్ టర్మ్ ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీకి ఊహించని పరాజయం

ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ అద్భుత విజయం

కీలక స్థానాల్లో పాగా



క్రైమ్ మిర్రర్, ఇంటర్నేషనల్ డెస్క్: అగ్రరాజ్యం అధినేత డోనాల్డ్ ట్రంప్ కు షాక్ తగిలింది. అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికల్లో అధికార రిపబ్లికం పార్టీకి ఊహించని ఘోర పరాభవం ఎదురైంది. పోలింగ్ ముగిసి ఓట్ల లెక్కింపు వేగంగా సాగుతున్న కొద్దీ ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. ప్రతినిధుల సభను పునరుద్ధరించుకోవడానికి కావాల్సిన స్థానాలు దక్కించుకొని..

మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే!



ఢిల్లీలో బాహాబాహీ కి ప్రయత్నం

మంత్రి దామోదర రాజనర్సింహ పై ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు ఫిర్యాదు

సీరియస్ గా యాక్షన్ లోకి దిగిన టిపిసిసి

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కట్టు దాటుతోంది. నిన్ననే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి ని టార్గెట్ చేసుకున్నారు. నిధులతో పాటు చేసిన పనులకు సంబంధించిన బిల్లుల విషయంలో జరుగుతున్న జాప్యంపై నిలదీసినంత పనిచేశారు.

మిగతా 3,లో

ఐటీ కంపెనీలపై దాడి!

కర్ణాటకలో పెరుగుతున్న ప్రాంతీయ అభిమానం

ఆందోళనలో పారిశ్రామిక వర్గాలు

అమరావతికి అరుదైన ఛాన్స్



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: కర్ణాటక రాష్ట్రం వ్యవహరిస్తున్న తీరు ఏపీకి వరంగా మారింది.

- మిగతా 2వ పేజీలో

ఆ సిఐకు హ్యాట్సాఫ్!

వరదలో కొట్టుకుపోతున్న ముగ్గురు మహిళలు

నడుముకు తాడు కట్టి వరదలో దిగి కాపాడిన సర్కిల్ ఇన్స్పెక్టర్

సోషల్ మీడియాలో వీడియోలు

అభినందనల వెల్లువ



2లో



అప్రూవ్డ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు లైన్ క్లియర్!

(మొదటి పేజీ తరువాయి)

పోరాటం ఇచ్చింది. దశాబ్దాల క్రితం లేఅవుట్ అనుమతులు పొంది.. నాన్ నాలా నిబంధనలు కలిగిన ఆస్తులు సాంకేతిక లోపాలు, బేస్ సర్వే నంబర్ల బ్లాకింగ్ కారణంగా.. 22 ఏ నిషేధిత జాబితాలో నిలిచిపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర నష్టపోయారు. ఈ సమస్యపై సమగ్ర విచారణ చేపట్టిన ప్రభుత్వం.. చట్టబద్ధమైన అనుమతులు ఉన్న నాన్ నాలా ప్లాట్లు, ఇళ్ల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇది మధ్య తరగతి వారికి నిజంగా శుభవార్త. రెవెన్యూ శాఖ జారీ చేసిన తాజా ఆదేశాల ప్రకారం.. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, డిటిసిపి, మున్సిపాలిటీలు, నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన అప్రూవుడ్ లేఅవుట్లకు సంబంధించిన ఆస్తులు 22ఖ జాబితాలో ఉన్నప్పటికి వాటి రిజిస్ట్రేషన్ కు అనుమతిస్తారు.

చాలా ప్రాంతాలకు విముక్తి..

లింక్ డాక్యుమెంట్లు, బిల్డింగ్ లేదా లేఅవుట్ అనుమతి పత్రాలు పక్కాగా ఉన్న సందర్భాల్లో నిషేధిత జాబితా ఆంక్షలు వర్తించవు. ఈ నిర్ణయంతో రంగారెడ్డి, మేడ్చల్– మల్కాజిగిరి తో పాటు రాష్ట్రవ్యాప్తంగా 240కి పైగా కాలనీలు, లేఅవుట్లలో చిక్కుకుపోయిన ప్లాట్ లను రిజిస్ట్రేషన్ స్వేచ్ఛ లభించింది. అంతేకాకుండా సాగు భూముల్లో గతంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించి అర్హమైన నాలా దరఖాస్తుల పరిష్కారానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది.



డిజిటల్ రిజిస్ట్రేషన్ పత్రాలు..

క్రమబద్ధీకరణకు సైతం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గమనార్హం. న్యాయవివాదాలు లేని ఆస్తులకు నిర్దీత నాలా రుసుముతో పాటు పారదర్శక నిబంధనలను వర్తింపజేస్తూ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దరఖాస్తుల డాక్యుమెంట్లను డిజిటల్ డేటా తో సరిచూసి.. ఆన్లైన్ వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే బయోమెట్రిక్ విధానంలో వేగంగా డిజిటల్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎక్కడైనా క్షేత్రస్థాయి సాంకేతిక ఇబ్బందులు లేదా శాఖల మధ్య వ్యత్యాసాలు ఎదురైతే.. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టర్ల నేతృత్వంలో ప్రత్యేక జిల్లా స్థాయి కమిటీలను కూడా బాధ్యులుగా నియమించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ సాహసోపేత నిబంధనల సవరణ వల్ల ఏళ్ల తరబడి నిలిచిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి పుంజుకోవడమే కాకుండా.. మధ్యతరగతి ప్లాట్ల యజమానులకు తమ సొంత ఆస్తులపై పూర్తి హక్కులు దక్కనున్నాయి.

చిన్న శ్రీనుకు షాక్!

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మధ్య శ్రీనివాసరావుకు షాక్ తగిలింది. ఆయన కుమార్తె సిరి సహస్ర బీసీ ధ్రువీకరణ విషయంలో న్యాయస్థానం కీలక ఆదేశాలు ఇచ్చింది. సరిగ్గా రేపు జడ్పిటిసి ఎన్నికల్లో సిరి సహస్ర బరిలో ఉండగా కోర్టు ఇచ్చిన తీర్పు సంచలనంగా మారింది. ఆమె బీసీ కానప్పటికీ రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంతో పాటు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై దాఖలైన పిటిషన్ పై హైకోర్టు విచారణ జరిపింది. కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ వివాదం తేలే వరకు ఆమె పొందుతున్న బీసీ రిజర్వేషన్ ప్రయోజనాలను సైతం బ్రేక్ వేసింది. కొద్ది రోజుల కిందట ఆమె తెలుగుదేశం పార్టీలో చేరారు. తన తండ్రి చిన్న శ్రీను తో కలిసి టిడిపిలోకి వెళ్లారు. విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా ఆమెకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. ఇంతలోనే ఈ కోర్టు వివాదం వెంటాడింది.

తెర్లాం జడ్పిటిసి గా బరిలోకి..

సిరి సహస్ర తాజా స్థానిక సంస్థల ఎన్నికల్లో తెర్లాం జడ్పిటిసి గా పోటీ చేస్తున్నారు. అయితే ఆస్థానం అన్ రిజర్వ్డ్ కు కేటాయించారు. అటువంటి చోట ఆమె పోటీ చేస్తున్నారు. గెలిస్తే ఆమెకు విజయనగరం జడ్పీ చైర్పర్సన్ అయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలో ఆమె కుల ధ్రువీకరణ పత్రం పై వివాదం తెరపైకి వచ్చింది. ఆమె తల్లి మార్వాడి కావడం.. సిరి సహస్ర అసలు పేరు మస్తాన్ జైన్ కావడంతో.. ఆమె ప్రత్యర్థులు ఇదే విషయాన్ని కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన చర్యలు తీసుకో కపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం విచారణ జరిపి ఈరోజు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. ఓసి కులానికి చెందిన సిరి సహస్ర బీసీ సర్టిఫికెట్ తో నామినేషన్ వేసినట్లు వైసిపి అభ్యర్థి బొమ్మి శ్రీనివాసరావు అభ్యంతరం తెలుపుతూ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ వ్యవహారం పై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని విజయనగరం జిల్లా కలెక్టర్కు ఆదేశాలు ఇచ్చింది.

అన్ రిజర్వుడ్ స్థానం అయినా..

అయితే ఇప్పటికే తెర్లాం జడ్పిటిసి బరిలో ఆమె ఉన్నారు. రేపే పోలింగ్ జరగనుంది. అయితే అది అన్ రిజర్వుడ్ కు కేటాయించిన జడ్పిటిసి స్థానం. అయితే బీసీ అభ్యర్థిగా ధ్రువీకరణ పత్రం సమర్పించడంతో రేపు పోలింగ్లో ఏం జరుగుతుంది అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అయితే అది అన్ రిజర్వు స్థానం కావడం.. అందరికీ పోటీ చేసే అవకాశం ఉండడంతో ఉపశమనం కలిగించే విషయం. కానీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మాత్రం బీసీ మహిళకు కేటాయించారు. ఆ పదవి సిరి సహస్రకు దక్కుతుందని అంతా భావించారు. కానీ ఎటువంటి బీసీ రిజర్వేషన్లు పొందకూడదని కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో.. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా ఆమె బరిలో ఉంటారా? హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో సుప్రీంకోర్టు ను ఆశ్రయిస్తారా? అన్నది చూడాలి.

'సదర్' తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక

అవస రం ఉందని, ఇందుకు యాదవుల సహకారం ఉండాలని కోరారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి గోల్కొండ కోట ఒకనాటి గొల్లకొండ అని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. యాదవుల సహకారంతోనే హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందిందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలన్న ఆలోచన చేయలేదని, గొల్ల కులస్తులు కోరగానే రాష్ట్ర పండుగగా ప్రకటించామని, సదర్ సమ్మేళనం నిర్వహణకు రూ.5 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. తమ ప్రభుత్వంలో గొల్ల కులస్తులకు సముచిత స్థానం కల్పించామని రేవంత్‌రెడ్డి అన్నారు. అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించామని వివరించారు. యాదగిరిగుట్ట గోశాలలో గోసంరక్షణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో యాదవుల వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామన్నారు. బిహార్‌లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించి, నేరగాళ్ల రాజ్యంగా మారిందని ఆర్జేడీ చీఫ్, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ విమర్శించారు. నగరంలో తమకు లభించిన అపూర్వ స్వాగతం మనసుకు తాకాయని, ఇంకా చారిత్రక సంప్రదాయం కొనసాగడం ఎంతో ప్రశంసనీయమన్నారు.

అమరవీరుల కాలనీపై రగడ!



(మొదటి పేజీ తరువాయి)

ఆ విలువైన భూములను అమ్ముతారు? అంటూ కేటీఆర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి..

కేటీఆర్ పై విరుచుకుపడుతున్న నేతలు..

అయితే తాజాగా కేటీఆర్ చేసిన ఈ కామెంట్స్ గులాబీ పార్టీ సెల్ఫ్ గోల్స్ గా మారాయి. అమరుల త్యాగాలను స్మరిస్తూ ప్రభుత్వం ఎక్కడ ఇల్లు కట్టిస్తామన్న స్వాగతించాల్సింది పోయి.. ఫామ్ హౌస్ వద్ద వద్దంటూ కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేయడం పై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. నిజానికి అమరవీరుల కుటుంబాలకు నివాసాలు కల్పిస్తామన్నప్పుడు ఏ రాజకీయపక్షమైన నిండు మనసుతో ఆహ్వానించడం కనీస ధర్మం. కానీ కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద మాత్రమే ఇళ్లు కట్టకూడదని.. నగరంలోని మియాపూర్ లోనే ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ పెట్టడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కెసిఆర్ ఫామ్ హౌస్ పక్కన తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు నివసించకూడదా? వారు వస్తే ఫామ్ హౌస్ లో ప్రశాంతత దెబ్బతింటుందనా? అనే ప్రశ్నల వర్షం కురిపిస్తూ కాంగ్రెస్ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు.

ఉద్యమ కాలంలో..

ఉద్యమ కాలంలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని.. వారికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని కేసీఆర్ చెప్పుకొచ్చారు. ఉద్యమ తెలంగాణ కాస్త బంగారు తెలంగాణ గా మారింది. తరువాత ఉద్యమకారుల గురించి మరిచిపోయారు. మరోవైపు కెసిఆర్ కు ఆస్తులు లేవంటూనే పెద్ద ఎత్తున అక్రమాస్తులు ఉన్నాయంటూ కాంగ్రెస్ ఆరోపించడం ప్రారంభించింది. కెసిఆర్ ఫామ్ హౌస్ చుట్టూ రాజకీయం నడిపిస్తోంది. ఇటువంటి సమయంలో కేటీఆర్ సెల్ఫ్ గోల్ వేసుకున్నట్టు.. ఫామ్ హౌస్ వద్ద వద్దు.. మియాపూర్ లో ఖరీదైన భూముల వద్ద కట్టాలి అంటూ సెటైరికల్ గా మాట్లాడారు. పైగా ఎవరి అబ్బ సొమ్ము అంటూ చేసిన వ్యాఖ్యలు మరింత అభ్యంతర కరంగా మారాయి. పదేళ్ల గులాబీ పార్టీ పాలనలో కోకాపేట, మోకిలా, బద్వేల్, గచ్చిబౌలి వంటి అత్యంత విలువైన ప్రభుత్వ భూములను రికార్డు ధరలకు వేలం వేసిన విషయాన్ని ఇప్పుడు కాంగ్రెస్ నేతలు గుర్తు చేస్తున్నారు. వారు చేస్తే ఒప్పు.. ఎదుటివారు చేస్తే తప్పా అని నిలదీస్తున్నారు.

యధావిధిగా ప్రాదేశిక ఎన్నికలు!

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:ఏపీలో ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానాలకు యధావిధిగా గురువారం పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా మూడు మండలాలు మినహా మిగతా చోట్ల పోలింగ్ యధావిధిగా ఉంటుందని తెలిపింది. తుఫాన్ కారణంగా పలుచోట్ల వర్షాలు కురుస్తుండడంతో పోలింగ్ నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్ చంద్ర పూనేత జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. చాలా చోట్ల వర్షాలు తగ్గుముఖం పట్టాయని కలెక్టర్లు సమాచారం ఇచ్చారు. కలెక్టర్ల నుంచి సమాచారం తీసుకున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి.. గురువారం యధావిధిగా ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒకవేళ ఎన్నికల నిర్వహణలో ఇబ్బందులు ఉంటే క్షేత్రస్థాయి నుంచి కలెక్టర్ల నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

వర్షాలతో అనుమానం..

ఇటీవల తుఫాన్ నేపథ్యంలో ప్రాదేశిక ఎన్నికల నిర్వహణపై అనేక రకాల అనుమానాలు వ్యక్తమయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో అసలు పోలింగ్ జరుగుతుందా? లేదా? అనే అనుమా నాలు పెరిగాయి. కానీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సమీక్షించి పోలింగ్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే పోలింగ్కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపింది. క్షేత్రస్థాయిలో పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు ఎస్ ఇ సి పేర్కొన్నారు.

ఏర్పాట్లు పూర్తి..

రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లో జడ్పిటిసి లతో పాటు ఎంపీటీసీల ఎన్నికలకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్స్ లతో బయలుదేరారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ పోలింగ్ జరగనుంది. పోలింగ్ అనంతరం భారీ భద్రత నడుమ బ్యాలెట్ బాక్స్ లను స్ట్రాంగ్ రూములకు తరలించనున్నారు. కాగా ఈనెల 7న కౌంటింగ్ కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆ సిఐకు హ్యాట్సాఫ్!

(మొదటి పేజీ తరువాయి)

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: ఏపీలో మురసు తుఫాన్ ప్రభావం చూపుతోంది. ప్రధానంగా కోస్తాంధ్రలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఏకధాటిగా వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీంతో రహదారులపై పెద్ద ఎత్తున నీరు చేరుతోంది. వాగులు వంకలు, పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో చిలకలూరిపేటలో ఓ చోట భారీగా వరద నీరు చేరింది. అందులో ముగ్గురు మహిళలు చిక్కుకుపోయారు. వరద ప్రవాహం ఉధృతంగా ఉండడంతో వారు బయటకు రాలేకపోయారు. దీంతో చిలకలూరిపేట సిఐ సుబ్బానాయుడు తన సిబ్బందితో కలిసి వరద నీటిలోకి దూకి రక్షించారు. ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ గా మారుతోంది. సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుంది. సీఐతో పాటు పోలీస్ సిబ్బంది సాహసాన్ని అందరూ అభినందిస్తున్నారు.

పరిస్థితి ఆందోళనకరం..: తుఫాన్ విరుచుకుపడుతుండడంతో చిలకలూరిపేట పట్టణం పరిస్థితి చాలా ఆందోళనకరంగా మారింది. అక్కడ నేషనల్ హైవేపై భారీగా వరద నీరు ముంచేత్తింది. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఎడతెరిపి లేని వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో తిమ్మాపురం అండర్పాస్ దగ్గర వరద నీరు భారీగా చేరింది. ఆ వరద నీటిలో ముగ్గురు మహిళలు చిక్కుకుపోయారు. వరద ప్రవాహం ఉధృతంగా ఉండడంతో వారు బయటకు రాలేక ఆహాకారాలు చేశారు. స్థానికులు గమనించినప్పటికీ వరద ఉధృతిని చూసి ఎవరు సాహసించలేకపోయారు. అయితే ఈ విషయం చిలకలూరిపేట పోలీస్ స్టేషన్ కు చేరింది. వెంటనే సిఐ సుబ్బానాయుడు తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. మహిళలను కాపాడే ప్రయత్నం చేశారు.

ఏమాత్రం ఆలోచించకుండా..: ఎదురుగా భారీగా వరద ఉధృతి ఉంది. అందులో మహిళలు కొట్టుకుపోయే అవకాశం ఉంది. అందుకే క్షణం ఆలోచించకుండా ఒక తాడును తన నడుముకు గట్టిగా కట్టుకొని.. తాడు రెండోకొనను ఒడ్డున ఉన్న స్థానికులకు, సిబ్బందికి పట్టుకోమని చెప్పి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీటిలోకి దూకారు సీఐ. ఆ ప్రవాహాన్ని ఎదురొడ్డి ఈదుకుంటూ వెళ్లి.. ప్రాణభయంతో ఉన్న ఆ ముగ్గురు మహిళలను అదే తాడు సాయంతో ఒడ్డుకు చేర్చారు. సీఐ చేసిన ఈ పనిపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి మహిళలను రక్షించిన సిఐ సుబ్బానాయుడు ధైర్య సాహసాల పై ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులతో పాటు స్థానికులు ఆయన అంకితభావానికి హాట్సాఫ్ చెబుతున్నారు.

డోనాల్డ్ ట్రంప్‌కు షాక్!

(మొదటి పేజీ తరువాయి)

డెమోక్రాట్లు తమ మెజారిటీని ఖరారు చేసుకున్నారు. ఓటర్లు రిపబ్లిక్ అన్న పాలనపై తీవ్ర వ్యతిరేకతను ప్రదర్శిస్తూ స్పష్టమైన తీర్పు ఇస్తున్నారు.

స్వింగ్ స్టేట్లో ప్రభంజనం..

దాదాపు అన్ని రాష్ట్రాల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థులు మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. ముఖ్యంగా స్వింగ్ స్టేట్స్ లో కీలక స్థానాలను కైవసం చేసుకున్నారు. పెన్సిల్వేనియా, న్యూయార్కులతో పాటు రిపబ్లిక్ అన్లు సుదీర్ఘ కాలంగా పట్టు సాధించిన నార్త్ కరోలినా వంటి నియోజకవర్గాల్లో కూడా స్థానాలను కైవసం చేసుకుని సంచలనం సృష్టించారు. అంతేకాకుండా టెక్సాస్, ఓహియో యూఎస్ సెనెట్ స్థానాల్లోనూ డెమొక్రాట్లు కీలక విజయాలు నమోదు చేయడంతో.. సెనెట్ లోనూ బలమైన పట్టు సాధించేలా ఫలితాలు వెలువడుతున్నాయి. డోనాల్డ్ ట్రంప్ అప్రూవల్ రేటింగ్స్ చరిత్రలోనే కనిష్టంగా 32 శాతానికి పడిపోవడమే ఈ ఘోర పరాజయానికి ప్రధాన కారణం.

ఆర్థిక సంక్షోభాల కారణంతోనే..

అమెరికాలో ప్రధానంగా నిత్యవసర ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, విదేశాంగ విధానంలో దెబ్బతిన్న ప్రతిష్ట,, కాంగ్రెస్ నిధులను అడ్డుకుంటామంటూ ట్రంప్ చేసిన బెదిరింపులను అమెరికన్ ఓటర్లు అసహ్యించుకుంటున్నారు. ట్రంప్ అనుసరించిన ఏకపక్ష నిర్ణయాలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతోనే పౌరులు డెమొక్రటిక్ పార్టీ వైపు భారీగా మొగ్గు చూపారని ఫలితాలు తేటతెల్లము చేస్తున్నాయి. కాంగ్రెస్ లో హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ మెజారిటీ డెమోక్రాట్ల చేతుల్లోకి వెళ్లడంతో వైట్ హౌస్ లో ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలకు గట్టి బ్రేకులు పడనున్నాయి.

పెరగనున్న ప్రతిపక్షాల పాత్ర..

అమెరికన్ పార్లమెంటులో బడ్జెట్ ఆమోదం, బిల్లుల ఆమోదంతో పాటు ప్రభుత్వ విధానాల పరిశీలనలో ప్రతిపక్షాల పాత్ర ఇప్పుడు కీలకం కానుంది. తమపై వీటో అధికారాలు ఉపయోగిస్తాం అని బెదిరించిన ట్రంప్ కు అమెరికన్ పౌరులు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పారు. ఈ మిడిల్ టర్మ్ ఫలితాలు ట్రంప్ మిగిలిన పాలనా కాలాన్ని అత్యంత కష్టతరంగా మార్చనున్నాయి. మునుపటి మాదిరిగా ఆయన దూకుడు ప్రదర్శించే అవకాశమే లేదు. ఇది ఆయనకు అత్యంత సంక్లిష్ట సమయం అని అంతర్జాతీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

ఐటీ కంపెనీలపై దాడి!

భారతదేశానికి సిలికాన్ వ్యాలీగా, ప్రపంచ స్థాయి సాంకేతిక కేంద్రంగా వెలుగొందుతున్న బెంగళూరు మహానగరం.. ఇప్పుడు సంకుచిత భాషా దురాభిమానం, ప్రాంతీయ విద్వేషాల సుడిగుండంలో చిక్కుకుంటోంది. ఇటీవల కర్ణాటక రక్షణ వేదిక పేరుతో కొందరు తీవ్రవాద భావజాలం కలిగిన కార్యకర్తలు.. రాష్ట్ర జెండాలతో ఐటీ కంపెనీల క్యాంపస్లోకి జొరబడి గందరగోళం సృష్టిస్తున్నారు. ఇది పారిశ్రామిక వర్గాల్లో ఆందోళన కలిగించే విషయం. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే బహుళ జాతి కంపెనీల కార్యాలయాల్లోకి.. అక్రమంగా ప్రవేశించి.. మీ సంస్థలో ఎంతమంది స్థానిక కన్నడిగులు ఉన్నారు? రిక్రూట్మెంట్ డేటా బయట పెట్టండి అంటూ బెదిరింపులకు దిగడం చట్ట విరుద్ధం మాత్రమే కాదు.. నాగరిక సమాజం సిగ్గుపడే చర్య కూడా.

దిగ్గజాల ఆందోళన..: బెంగళూరులో జరుగుతున్న ఈ అరాచక వైఖరిపై ఇన్ఫోసిస్ మాజీ సి ఎఫ్ ఓ టీవీ మోహన్ దాస్ పాయ్ వంటి దిగ్గజాలు గళం ఎత్తితే.. వారిపై వ్యక్తిగత దాడులు, విమర్శలకు దిగడం అక్కడి తీవ్ర పరిస్థితులకు నిదర్శనం. భాషను గౌరవించడం సరైనదే కానీ.. హింస, ఆఫీసులపై దౌర్జన్యాలు చట్టబద్ధమైన పాలన వైఫల్యానికి నిదర్శనం అని మోహన్ దాస్ పాయ్ ఖండించారు. ఆందోళనకారులు ఆయనను బెంగళూరు వనరులను అనుభవిస్తూ.. స్థానికులకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారంటూ టార్గెట్ చేస్తున్నారు. మెరిట్, గ్లోబల్ కాంపిటేటివ్ నెస్ ప్రాతిపదికన పనిచేసే హైటెక్ రంగంలో.. ఇలాంటి బలవంతపు ఆడిటింగ్లు, బెదిరింపులు కొనసాగితే.. అక్కడ కార్యకలాపాలు నిర్వహించడం అసాధ్యమని.. ఇతర ప్రశాంత రాష్ట్రాలకు లేదా దేశాలకు తరలిపోక తప్పదని ఇప్పటికే పలు టెక్ కంపెనీల ప్రతినిధులు అంతర్గతంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఇప్పటికే సంక్షోభం..: బెంగళూరు నగరంలో అస్తవ్యస్తమైన ట్రాఫిక్ జామ్ లు, తీవ్రమైన తాగునీటి ఎద్దడి, వర్షం పడితే నీట మునిగే రోడ్లు వంటి మౌలిక సదుపాయాల సంక్షోభంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. జీవన నాణ్యత గణనీయంగా పడిపోవడంతో నగరంలోని టెక్కీలు, కంపెనీలు విసిగిపోయి ఉన్నాయి. ఇలాంటి సమయంలో నగరానికి ప్రాణవాయువైన ఐటీ రంగానికి రక్షణ కల్పించాల్సింది పోయి.. ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానిక రిజర్వేషన్ల పేరుతో ప్రభుత్వం సాగదీత ధోరణి అవలంబించడం, కన్నడ వేదికల అరాచకాలను ఉదాసీనంగా వదిలేయడం పరిస్థితిని మరింత విషమింప చేస్తోంది. శాంతిభద్రతల లోపం, ఉద్యోగుల భద్రతకు గ్యారెంటీ లేని వాతావరణం నెలకొంటే అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు.. బెంగళూరును విడిచి పెట్టడానికి ఏమాత్రం వెనుకడుగు వేయవు.

తెలుగు రాష్ట్రాలకు వరం..: కర్ణాటకలో జరుగుతున్న ఈ పరిణామాలు తెలుగు రాష్ట్రాలకు ఒక వరంగా మారాయి.. చారిత్రాత్మక సువర్ణ అవకాశంగా వచ్చి పడ్డాయి. ముఖ్యంగా కొత్తగా రూపుదిద్దుకుంటున్న అమరావతికి ఇది అరుదైన చాన్స్ గానే చెప్పవచ్చు. హైదరాబాద్ ఇప్పటికే మెరుగైన మౌలిక వసతులు, కాస్మోపాలిటన్ వాతావరణం, సురక్షితమైన శాంతి భద్రతలతో ప్రపంచ స్థాయి పోటీనిస్తోంది. మరోవైపు సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం.. అమరావతి రాజధాని లో భారీ గ్రీన్ ఫీల్డ్ ఐటి పార్కులు, రాయితీలు, సులభతర వాణిజ్య విధానాలతో టెక్ సంస్థలను ఆహ్వానించేందుకు ఇది సరైన సమయం.

మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే!





(మొదటి పేజీ తరువాయి)

అవసరం అనుకుంటే రాజీనామా చేస్తానంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయితే ఇవి మరువక ముందే.. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుల మధ్య వివాదం నడిచింది. ఏకంగా ఢిల్లీలోనే ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి.. బాహబాహీ కి దిగేవరకు పరిస్థితి వచ్చింది. దీనిపై ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు ఏకంగా పార్టీ హై కమాండ్ కు ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది.

వరుస ఘటనలతో..

అయితే వరుస జరుగుతున్న ఘటనల నేపథ్యంలో కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్గా దృష్టి పెట్టింది. పార్టీలో రోజురోజుకు శృతిమించుతున్న గ్రూపు తగాదాలు, బాహటంగా రచ్చకెక్కుతున్న క్రమశిక్షణ రాహిత్యం పై తెలంగాణ కాంగ్రెస్ హై కమాండ్ ఫుల్ ఫోకస్ పెట్టింది. దీనిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలో ఉన్న వేళ నేతలు సంయమనం పాటించాల్సింది పోయి.. వ్యక్తిగత ఆధిపత్యం, నామినేట్ పదవులు, నియోజకవర్గ వ్యవహారాలపై పరస్పరం దాడులకు దిగడంపై ఆయన సీరియస్ అయ్యారు. అంతర్గత క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై ఎంతటి స్థాయి నేతలైన ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.

ఇటీవల ఢిల్లీలో..

ఇటీవల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఓ హోటల్ లాబీలో డిసిసి అధ్యక్ష పదవి, సంస్థాగత నియామకాల విషయంలో మంత్రి దామోదర రాజనర్సింహకు, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుల మధ్య వివాదం జరిగింది. తోటి ఎమ్మెల్యేల సమక్షంలో మంత్రి దామోదర తనపై తీవ్ర పదజాలంతో దూషణలకు దిగారని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు పిసిసికి ఫిర్యాదు చేశారు. ఈ ఘటన పార్టీ హై కమాండ్ దృష్టికి కూడా వెళ్ళింది. ఈ వివాదంపై పూర్తి విచారణ జరిపేందుకు బుధవారం గాంధీభవన్ కు స్వయంగా హాజరు కావాల్సిందిగా మంత్రి దామోదర రాజనర్సింహకు, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు లకు పిసిసి చీఫ్ ఆదేశాలు జారీ చేశారు. ఒక్క ఈ వివాదం పైనే కాదు ఇటీవల జరిగిన అన్ని రకాల పరిణామాలపై చాలామంది నేతలకు అంతర్గత నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీలో క్రమశిక్షణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గకూడదు అని హైకమాండ్ ఇచ్చిన ఆదేశాలతో.. టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సీరియస్గా యాక్షన్ లోకి దిగినట్లు సమాచారం.

'మురసు' తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం రాష్ట్రంలోని రెండు ప్రధాన సమస్యలపై దృష్టి సారించారు. ఒకవైపు 'మురసు' తుపానుతో దెబ్బతిన్న జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించగా, మరోవైపు తీవ్ర కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో సమీక్షా సమావేశం జరిపారు. రాష్ట్రంలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. తుపాను కారణంగా ప్రభావితమైన గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో సీఎం ఏరియల్ సర్వే నిర్వహించారు. కారంచేడు, కొత్తపట్నం, చీరాల, చిలకలూరిపేట, పర్చూరు వంటి ప్రాంతాల్లోని ముంపు నీటిని వెంటనే తొలగించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారులకు అంతరాయం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. మరోవైపు, ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నాయని, కొన్నిచోట్ల చిన్న నీటిపారుదల చెరువులు పొంగిపొర్లుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం, రాష్ట్రంలో కరవు పరిస్థితులను అంచనా వేయడానికి వచ్చిన అంతర్-మంత్రిత్వ కేంద్ర బృందం సభ్యులతో చంద్రబాబు సమావేశమయ్యారు. నవంబర్ 2, 3 తేదీల్లో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించిన ఈ బృందం, తమ పరిశీలన వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేసింది.


ఓటు చోరీపై పార్లమెంట్లో చర్చ!

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 13 కోట్ల ఓట్లను తీసేసారంటూ ఆరోపిస్తోంది. గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతోంది. ఈ అంశంపై ఏకంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని... దమ్ముంటే సభకు వచ్చి తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలతో చర్చించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. వీధి పోరాటాలు, ఫేక్ నరేటివ్ లు మాని చట్టసభ వేదికగా ముఖాముఖి తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. కమిషన్ లెక్కల ప్రకారం ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా తొలగించినవి అక్రమ ఓట్లేనని బిజెపి స్పష్టమైన డేటాను ప్రదర్శిస్తోంది. అయితే ఓటు చోరీ పై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ సరైన ఆధారాలు చూపలేకపోతోంది.

పక్కా లెక్కలతో బిజెపి..

ఓట్ల తొలగింపునకు సంబంధించి బిజెపి పక్కా లెక్కలతో ఉంది. చనిపోయిన వారి పేరు మీద ఉన్న సుమారు మూడు కోట్ల ఓట్లు, వేరువేరు నియోజకవర్గాల్లో నమోదైన డబ్బులు ఎంట్రీ ఓట్లు, ప్రధానంగా దేశంలో చొరబడిన దాదాపు మూడు కోట్లకు పైగా బంగ్లాదేశ్ చొరబాటుదారుల ఓట్లను మాత్రమే జాబితాల నుంచి తొలగించామని బిజెపి స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు ఈ చొరబాటుదారులకు మద్దతుగా నిలుస్తూ ఓటు చోరీ అని బూటకపు ప్రచారాలు చేస్తోందని.. డెమోగ్రఫీని మార్చే



కుట్రలకు బాసటగా నిలుస్తోంది అంటూ ఘాటుగా విమర్శించింది.

కాంగ్రెస్ నో..

భారతీయ జనతా పార్టీ నుంచి వచ్చిన ఈ సవాల్ ను స్వీకరించే పరిస్థితిలో లేదు కాంగ్రెస్. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్లో చర్చకు రాకుండా.. ముందుగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి.. ఆ తరువాతే చర్చ అంటూ కాంగ్రెస్ పెడుతున్న షరతులు సహేతుకంగా లేవు. తీవ్రమైన ఆరోపణలు చేసేటప్పుడు చట్టసభల్లో సాక్షాదారాలతో కేంద్రాన్ని నిలదీయాల్సింది పోయి.. కేవలం విచారణ అధికారుల రాజీనామా సాకుతో పారిపోవడం.. వారి వద్ద ఆధారాలు లేవనే విషయాన్ని బయటపెట్టింది. మునుపటి పరాజ్యాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ చేసిన ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బిజెపి అన్ని విధాల సిద్ధపడుతోంది.

శాసన వ్యవస్థకు తీరని లోటు ..





ఉమ్మడి ఏపీ శాసనమండలి తొలి ఛైర్మన్ చక్రపాణి కన్నుమూత

ఐదు దశాబ్దాల ప్రజాసేవకు ముగింపు.. శాసన సంప్రదాయాల పెద్దదిక్కు ఇక లేరు

హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచిన మాజీ మండలి ఛైర్మన్

ఉమ్మడి రాష్ట్రంలో పునరుద్ధరించిన శాసనమండలికి తొలి సారథిగా బాధ్యతలు

చక్రపాణి సేవలను గుర్తుచేసుకుంటూ సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం

హైదరాబాద్: ప్రజాస్వామ్య వ్యవస్థలో పదవులు ఎన్నో రావొచ్చు.. కానీ ఆ పదవుల్లో ఉన్నప్పుడు పాటించిన విలువలు, నెలకొల్పిన సంప్రదాయాలే ఒక వ్యక్తికి శాశ్వత గుర్తింపును తీసుకొస్తాయి. సభా వ్యవహారాల నిర్వహణలో తనదైన విధానాన్ని అనుసరిస్తూ, పార్లమెంటరీ నియమాలకు ప్రాధాన్యమిచ్చిన ఓ సీనియర్ నేత ప్రస్థానం ముగిసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎ. చక్రపాణి బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన మరణవార్తతో రాజకీయ, శాసన వర్గాల్లో విషాదం నెలకొంది. శాసనమండలి పునరుద్ధరణ అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాని తొలి అధ్యక్ష బాధ్యతలు చక్రపాణికి అప్పగించారు. ఆ సమయంలో సభ నిర్వహణలో నియమ నిబంధనలకు, ప్రజాస్వామ్య పద్ధతులకు ఆయన అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. సభ్యుల మధ్య చర్చలు సజావుగా సాగేందుకు, సభా గౌరవం నిలిచేలా వ్యవహరించారు. శాసన వ్యవస్థకు సంబంధించిన విధివిధానాలపై ఆయనకు ఉన్న అనుభవం సభ నిర్వహణలో ప్రతిబింబించేది.

ఐదు దశాబ్దాల ప్రజా ప్రస్థానం

దాదాపు 50 సంవత్సరాల పాటు ప్రజా జీవితంలో కొనసాగిన చక్రపాణి వివిధ సందర్భాల్లో తన సేవలతో గుర్తింపు పొందారు. ముఖ్యంగా శాసనమండలి సంప్రదాయాలను కాపాడటంలో, సభా వ్యవహారాలకు గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడంలో ఆయన పాత్ర ప్రత్యేకంగా నిలిచింది. రాజకీయాలకు అతీతంగా శాసన ప్రక్రియల విలువను గుర్తించిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది.

సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం

చక్రపాణి మరణవార్తపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలి తొలి ఛైర్మన్‌గా ఆయన నిర్వహించిన బాధ్యతలను గుర్తుచేసుకున్నారు. అర్ధ శతాబ్దానికి సమీపంగా ప్రజా జీవితంలో కొనసాగుతూ అందించిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన మరణం తెలంగాణ రాజకీయ, శాసన రంగాలకు తీరని లోటని సంతాపం తెలిపారు. చక్రపాణి మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శాసన వ్యవస్థలో ఆయన అందించిన సేవలు, నెలకొల్పిన సంప్రదాయాలు చిరకాలం గుర్తుండిపోతాయని పలువురు పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఉద్యోగులు కూటమికే అండగా నిలిచారు: మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు

పోస్టల్ బ్యాలెట్లలో వైసీపీ కన్నా రెట్టింపు ఓట్లు కూటమికి వచ్చాయని వెల్లడి

12వ పీఆర్సీ సహా మిగిలిన డిమాండ్లను త్వరలో పరిష్కరిస్తామన్న అశోక్ బాబు

తుపానులు, ఎన్నికల వేళ శ్రమించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపిన టీడీపీ నేత

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యోగులు కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచారని, పోస్టల్ బ్యాలెట్ల ద్వారా తమ సంపూర్ణ మద్దతు తెలిపారని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు అన్నారు. ప్రజలు దీపావళి కానుకగా 95 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమికి అద్భుత విజయాన్ని అందించారని ఆయన పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 164 సీట్లు ఇచ్చిన స్ఫూర్తితోనే స్థానిక ఎన్నికల్లోనూ ప్రజలు కూటమిని ఆశీర్వదించారని తెలిపారు. సాధారణంగా ప్రభుత్వాలపై ఉద్యోగుల్లో అసహనం ఉంటుందని, కానీ ఈసారి పోస్టల్ బ్యాలెట్లలో వైసీపీకి వచ్చిన ఓట్లకు రెట్టింపు స్థాయిలో కూటమికి ఓట్లు వచ్చాయని అశోక్ బాబు వివరించారు. ఇది కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ వర్గాలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. ఇటీవల రెండు తుపానులు, ఎన్నికలు ఏకకాలంలో వచ్చినా రెవెన్యూ, వైద్య, అగ్నిమాపక, పురపాలక, పౌరసరఫరాల, అంగన్‌వాడీ, విద్యుత్ శాఖల ఉద్యోగులు రేయింబవళ్లు కష్టపడి పనిచేశారని, వారి నిబద్ధతకు కూటమి తరపున మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు రూ.40 వేల కోట్ల బకాయిలు పెట్టిందని, సీపీఎస్ రద్దు హామీని విస్మరించి, రివర్స్ పీఆర్సీ అమలు చేసి, చివరకు ఉద్యోగుల జీపీఎఫ్ డబ్బులను కూడా వాడుకుని వారిని తీవ్రంగా నష్టపరిచిందని అశోక్ బాబు ఆరోపించారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ
గురువారం
5-11-2026
3



నవంబర్ 6న జరిగే ఏఐవైఎఫ్ ఎస్.ఐ,కానిస్టేబుల్ మోడల్ టెస్ట్ జయప్రదానికై విస్తృతంగా ప్రచారం.

ఏఐవైఎఫ్ మోడల్ టెస్ట్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరణ.

అభ్యర్థులు సద్వినియోగం చేసుకోండి-ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల.రమేష్ పిలుపు.

ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించే ఎస్.ఐ,కానిస్టేబుల్ పరీక్షకు ధీటుగా అదే స్థాయిలో జిల్లా స్థాయిలో నవంబర్ 6న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మోడల్ ఎస్.ఐ,కానిస్టేబుల్ టెస్టును ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు,ఈ టెస్టును అభ్యర్థులందరు తప్పకుండా సద్వినియోగం చేసుకోగలరని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల.రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక యన్.టి. ఆర్ సర్కిల్ లోని బి.సి. స్టడీ సర్కిల్ లో టెస్ట్ పోస్టర్లను,కరపత్రాలను ఆవిష్కరించిన,అనంతరం ఖమ్మంలోని బైపాస్ రోడ్డులో రామకృష్ణ పంక్షన్ హాల్ లో నడుస్తున్న పి.ఎస్.ఆర్ కోచింగ్ సెంటర్ లో, అలాగే నగరంలోనీ వివిధ స్టడీ సర్కిల్స్, కోచింగ్ సెంటర్లు, స్టడీ హాల్స్ లో టెస్ట్ జయప్రదానికై విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోతున్న ఎస్.ఐ,కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు రాష్ట్ర స్థాయిలో ప్రముఖ మేధావులతో,విద్యావేత్తలతో తయారుచేసిన మోడల్ పేపర్ తో నవంబర్ 6న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మోడల్ ఎస్.ఐ,కానిస్టేబుల్ టెస్టును నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ టెస్ట్ ప్రధానంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో వివిధ చోట్ల పరీక్ష కేంద్రాలను పెట్టి నిర్వహించడం జరుగుతుందనీ,కావున ఖమ్మం జిల్లాలో కానిస్టేబుల్,ఎస్.ఐ కి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులందరూ తప్పకుండా మోడల్ టెస్ట్ వ్రాసి జిల్లా స్థాయిలో వాళ్ళ టాలెంట్ ను, ర్యాంక్ ను తెలుసుకొని,ఇంకా భవిష్యత్ లో వ్రాసే ప్రభుత్వ పరీక్షకు ఇంకా బాగా ప్రిపేర్ కావడానికి ఈ టెస్ట్ చాలా ఉపయోగపడుతుందని,అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోగలరని వారు కోరారు.టెస్ట్ కి సంబంధించిన వివరాలను ఈ నెంబర్ లను సెల్.9908842328,9490469559,9963918170 సంప్రదించగలరని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు.శ్రావణ్, నగర కార్యదర్శి చిరా.కృష్ణ ప్రసాద్,జిల్లా యంగ్ ఉమెన్ నాయకులు బొప్పి.ఉమా,జిల్లా నాయకులు శ్రీకాంత్,సురేష్,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డికి ఈడీ కస్టడీ

ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిని రెండు రోజులు విచారించనున్న అధికారులు

ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి ఈశ్వర్ అత్యంత సన్నిహితుడు

ఆర్థిక లావాదేవీలు, ఇతరుల ప్రమేయంపై ఈడీ ఆరా



ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిని రెండు రోజుల పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు అతడిని కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్న ఈశ్వర్ రెడ్డిని ఈడీ అధికారులు పీటీ వారెంట్‌పై నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరగా, న్యాయస్థానం రెండు రోజులకు అనుమతించింది. అంతకుముందు ఈశ్వర్‌కు ఈ నెల 16వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఏపీ లిక్కర్ స్కామ్‌లో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కెసిరెడ్డికి ఈశ్వర్ అత్యంత సన్నిహితుడని ఈడీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ కుంభకోణంలో ఈశ్వర్ పాత్ర, జరిగిన ఆర్థిక లావాదేవీలు, తెరవెనుక ఉన్న ఇతర కీలక వ్యక్తుల ప్రమేయంపై ఈడీ అధికారులు లోతుగా ఆరా తీయనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 గురువారం 5-11-2026

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి!





మందమర్రి ఏరియాలో ఎఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌లు

మందమర్రి, నవంబర్ (క్రైమ్ మిర్రర్) :సింగరేణి కార్మికుల బకాయిలు, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలోని కేకే-5, కేకే ఓసీ, వర్క్‌షాప్, స్టోర్స్, సివిల్, కేకే-1 డిస్పెన్సరీ, ఎస్‌అండ్‌పీసీ, ఎంవీటీసీ కార్యాలయాల వద్ద బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. యూనియన్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాథుని సుదర్శన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పిట్ కార్యదర్శుల అధ్యక్షతన సమావేశాలు జరిగాయి.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. లేబర్ కమిషనర్ సమక్షంలో ఒప్పందం కుదిరినా యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రతినెలా మెడికల్ బోర్డు నిర్వహించి, మారుపేర్ల సమస్యలో 35-40 ఏళ్ల వయస్సున్న అర్హులకు న్యాయం చేయాలని కోరారు. అర్హులైన డిపెండెంట్ అభ్యర్థులకు నెల రోజుల్లోగా ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని, కార్మికుల సొంతింటి పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టీజీజెన్కో, టీజీట్రాన్స్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన రూ.59 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు సోమిశెట్టి రాజేశం, కంది శ్రీనివాస్, పెద్దపల్లి బానయ్య, ఎగ్గేటి రాజేశ్వరరావు, సి.వి.రమణ, టేకుమట్ల తిరుపతి, పిట్ కార్యదర్శులు గాండ్ల సంపత్, మర్రి కుమారస్వామి, సీహెచ్‌పీ శర్మ, కల్వల శ్రీనివాస్, పారుపల్లి సంజీవ్‌కుమార్, ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి సింగిల్ విండో చైర్మన్‌గా హరీష్ రెడ్డి నియామకం



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి సింగిల్ విండో చైర్మన్‌గా రఘుపతిపేట గ్రామానికి చెందిన హరీష్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సింగిల్ విండో చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకంతో రఘుపతిపేట గ్రామంతో పాటు కల్వకుర్తి ప్రాంతంలో ఆయన అభిమానులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు హరీష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలుపుతున్నారు. ఆయన నాయకత్వంలో సహకార సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నారు. రైతులకు, సహకార సంఘం సభ్యులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తనపై నమ్మకం ఉంచి సింగిల్ విండో చైర్మన్‌గా కీలక బాధ్యతలు అప్పగించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి హరీష్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ అందరి సహకారంతో ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు.

ఈవోను, ఇన్స్పెక్టర్ ను సన్మానించిన జర్నలిస్టులు



వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, నవంబర్ 04: మండలం పాలంపేట గ్రామంలో గల ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రామప్ప దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఇమ్మడి భాస్కర్ తోపాటు ఆలయ ఇన్స్పెక్టర్ అనిల్ ను బుధవారం వెంకటాపూర్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఓద్దుల మురళి ఆధ్వర్యంలో జర్నలిస్ట్ లు ప్రత్యేకంగా కలిశారు. రామప్ప దేవాలయ అభివృద్ధికి పాటుపడుతున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి భాస్కర్ తోపాటు ఇన్స్పెక్టర్ అనిల్ ను జర్నలిస్టులు శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయం లో వందల సంవత్సరాలుగా శ్రీ రామలింగేశ్వర స్వామికి సోమసూత్రం మూసుకుపోవడంతో అభిషేకల సమయం కుదింపుతో ఇబ్బంది పడుతున్న భక్తులను గమనించి తన సాయి శక్తుల కృషి చేసి సోమ సూత్రాన్ని పునరుద్దించడంలో ముందు ఉండడంతో పాటు దేవాలయ ఆవరణలో భక్తులకు పలు సౌకర్యాలు కల్పించడంలో అత్యంత కృషి చేస్తున్నారని జర్నలిస్టులు పేర్కొన్నారు. రామప్ప దేవాలయ అభివృద్ధి సంక్షేమం కోసం ఈవో తన వంతుగా పూర్తి సహకారం అందించాలని జర్నలిస్టు కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ జర్నలిస్టులు బేతి సతీష్ యాదవ్, పిల్లలమర్రి శివ, గోరంటాల విజయ్ కుమార్, దండపెల్లి సారంగం గౌడ్, పిల్లలమర్రి రాము, గునీగంటి హరీష్, భానోత్ యోగి, తోపాటు పూజారులు హరీష్ శర్మ,ఉమాశంకర్, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేనలోకి బుప్పి శివకుమార్

నీరుడు సర్వేష్ ముదిరాజ్ సమక్షంలో పార్టీలోకి ఆహ్వానం



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హైదర్‌షాకోట్ 123వ డివిజన్‌లో రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ పార్టీని వీడిన బుప్పి శివకుమార్ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరారు. పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో, నీరుడు సర్వేష్ ముదిరాజ్ సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుప్పి శివకుమార్‌కు పార్టీ నాయకులు స్వాగతం పలికి పార్టీలోకి ఆహ్వానించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నీరుడు సర్వేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. యువత, స్థానిక నాయకులు పార్టీలో చేరడం ద్వారా పార్టీ కార్యక్రమాలు మరింత విస్తృతమవుతాయని అన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పగటిపూట ఇంట్లో చోరీ.. నిందితుడి అరెస్ట్

మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల ఛేదింపు.. భారీగా బంగారు ఆభరణాలు స్వాధీనం

సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలతో నిందితుడి గుర్తింపు





గండిపేట(క్రైమ్ మిర్రర్): పగటిపూట ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని భారీ చోరీకి పాల్పడిన నిందితుడిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. కేసును ఛేదించి చోరీకి గురైన బంగారు ఆభరణాల్లో భారీ మొత్తాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక యాక్టివా ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. లక్ష్మిగూడలో కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తి అక్టోబర్ 19న ఉదయం 11 గంటల సమయంలో తన భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భోజనం కోసం ఇంటికి తిరిగి వచ్చేసరికి ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా కూడా పగలగొట్టి ఉంది. అందులో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీకి గురైన వాటిలో నల్లపూసల గొలుసు, బంగారు బ్రాస్‌లెట్, రెండు బంగారు గొలుసులు, చెవి కమ్మలు, ఉంగరాలు, చంపసరాలు కలిపి సుమారు 15.5 తులాల బంగారం, 40 తులాల వెండి, నగదు ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను సేకరించారు. నిరంతర దర్యాప్తు అనంతరం నవంబర్ 4న నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని సయ్యద్ హమీద్ (48)గా గుర్తించారు. ఇతను పండ్ల వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడి నుంచి వివిధ రకాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో పిల్లల ఉంగరాలు, చెవి కమ్మలు, నల్లపూసలు, బ్రాస్‌లెట్లు, గొలుసులు, పుస్తెలతాళ్లు, లాకెట్లు, ఇతర ఆభరణాలు ఉన్నాయి. మొత్తం స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల బరువు సుమారు 500 గ్రాములకు పైగా ఉన్నట్లు వివరాలు సూచిస్తున్నాయి. వీటితో పాటు ఒక యాక్టివా ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. చంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ ఎ. సుధాకర్ పర్యవేక్షణలో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ చి. శ్రీనివాస్, డీఎస్ఐ బి. వేణుగోపాల్, క్రైమ్ సిబ్బంది సీసీటీవీ ఫుటేజీల పరిశీలన, సాంకేతిక ఆధారాల సేకరణ ద్వారా కేసును ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసు బృందాన్ని డీసీపీ ఎస్. శ్రీనివాస్ అభినందించారు. పగటిపూట ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభం

జూకల్ ప్రజల చిరకాల నిరీక్షణకు తెర.. రాకపోకలకు తప్పిన ఇబ్బందులు


గ్రామ పెద్దల సహకారంతో నిర్మాణం.. పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం



గండిపేట(క్రైమ్ మిర్రర్): రైలు రాకపోకల కారణంగా ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులకు పరిష్కారం లభించింది. శంషాబాద్ మండలం షాపూర్ నుంచి జూకల్ గ్రామానికి వెళ్లే మార్గంలో నిర్మించిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిని బుధవారం జూకల్ గ్రామ సర్పంచ్ రాళ్లబండి ఐలమ్మ ప్రారంభించారు. జూకల్ గ్రామ పెద్ద మదన్ మోహన్ రెడ్డి సహకారం, ప్రోత్సాహంతో నిర్మించిన ఈ అండర్‌పాస్ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో జూకల్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. బ్రిడ్జి ప్రారంభంతో స్థానిక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఈ మార్గంలో రైలు వస్తున్న సమయంలో రైల్వే గేటు వద్ద వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేదని గ్రామస్తులు తెలిపారు. అత్యవసర పనులపై వెళ్లేవారు, ఉద్యోగులు, విద్యార్థులు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తుచేశారు. ఇప్పుడు అండర్‌పాస్ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో రైళ్ల రాకపోకలతో సంబంధం లేకుండా వాహనాల రాకపోకలు సాగించే అవకాశం ఏర్పడిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచే ఈ నిర్మాణం పరిసర గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని గ్రామ పెద్దలు అభిప్రాయ పడ్డారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి బ్రిడ్జి నిర్మాణానికి సహకరించిన మదన్ మోహన్ రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, జూకల్ గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

నార్సింగ్ చౌరస్తాలో కార్మికులతో మాట్లాడిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి



గండిపేట(క్రైమ్ మిర్రర్): మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం అండగా ఉంటానని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. నార్సింగ్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని నార్సింగ్ చౌరస్తా వద్ద బుధవారం మున్సిపల్ కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో తమ సమస్యలను జైపాల్‌రెడ్డి చొరవ తీసుకొని పరిష్కరించేవారని, ప్రస్తుతం ఆయన అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే తమ సమస్యల పరిష్కారానికి నేరుగా చొరవ తీసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యలపై స్పందించిన జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ (సూపర్‌వైజర్)కు ఒక నెల జీతం పెండింగ్‌లో ఉందని తనకు ఫోన్ ద్వారా సమాచారం అందిందని తెలిపారు. వెంటనే సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి పెండింగ్ జీతం విడుదల చేయించినట్లు కార్మికులకు వివరించారు. అదేవిధంగా కొన్ని రోజులుగా విధులకు హాజరుకాని వరప్రసాద్ అనే కార్మికుడిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి, తిరిగి విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండటం అవసరమని, తమ యూనియన్‌లో చేరి సంఘటితంగా సమస్యలపై పోరాడాలని ఈ సందర్భంగా ఆయన కార్మికులకు సూచించారు. దీనిపై కార్మికులు స్పందిస్తూ.. తమ సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చొరవ చూపుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై తాము ఆయన వెంటే ఉంటామని, కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.



వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుకోవాలి: ఎంపీడీవో శ్రీపతి బాపురావు

జైపూర్ నవంబర్ 4 (క్రైమ్ మిర్రర్): వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల నిల్వలను పెంచుకోవాలని ఎంపీడీవో శ్రీపతి బాపురావు సూచించారు. బుధవారం జైపూర్ మండలం రామారావుపేట గ్రామ పంచాయతీని ఆయన సందర్శించారు. గ్రామ సర్పంచ్ పులి రాజశేఖర్‌తో కలిసి విబిజిరాంజీ పథకం కింద చేపడుతున్న బోరు బావుల రీఛార్జ్ పనులను పరిశీలించారు. బావుల రీఛార్జ్ ద్వారా ఎండిపోయిన బోరు బావుల్లోనూ తిరిగి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉంటుందని, వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని తెలిపారు.అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ పనులను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీ రాజమౌళి, పంచాయతీ కార్యదర్శి రజిత తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సరెండర్ భూముల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్!

క్యాతనపల్లిలో అదనపు కలెక్టర్ రాములు పర్యటన.. 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగింపునకు అవకాశం

పాత దరఖాస్తుదారులు పత్రాలతో తహసీల్దార్‌ను సంప్రదించాలి



రామకృష్ణాపూర్, నవంబర్ 4 (క్రైమ్ మిర్రర్): సింగరేణి సంస్థ గతంలో ప్రభుత్వానికి సరెండర్ చేసిన భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పాత దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు పర్యటించారు. సరెండర్ భూముల్లో నివాసాలు ఏర్పరచుకుని క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న వారికి న్యాయం జరిగేలా పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం గతంలో జీవో 76 కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, వివిధ కారణాలతో క్రమబద్ధీకరణ కాని పాత దరఖాస్తులను మాత్రమే ప్రస్తుతం పరిశీలించనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయి విచారణ పూర్తయి డీడీ చెల్లించినప్పటికీ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు, విచారణ జరగక పాత ఆన్‌లైన్ పోర్టల్‌లో నిలిచిపోయిన దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని పేర్కొన్నారు.

22ఏ జాబితా నుంచి తొలగింపునకు అవకాశం

సింగరేణి సరెండర్ భూముల్లోని ఇళ్లు, స్థలాలు ప్రస్తుతం 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో యజమానులు క్రయవిక్రయాలు, ఇతరులకు బదిలీ చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తయి కన్వేయన్స్ డీడ్ జారీ అయితే నిబంధనల ప్రకారం ఆయా భూములను 22ఏ జాబితా నుంచి తొలగించేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా యజమానులకు భూములపై చట్టబద్ధమైన హక్కులు లభించనున్నాయి.

500 గజాల వరకు వెసులుబాటు

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గరిష్ఠంగా 500 గజాల విస్తీర్ణం ఉన్న స్థలాలను కొలతలు వేసి, ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం క్రమబద్ధీకరణ రుసుము వసూలు చేయనున్నారు. స్థలం విస్తీర్ణాన్ని బట్టి దరఖాస్తుదారులు నిర్ణీత మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

పాత పత్రాలతో తహసీల్దార్‌ను సంప్రదించాలి

గతంలో దరఖాస్తు చేసుకుని క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న వారు తమ పాత దరఖాస్తు ప్రతులు, భూమికి సంబంధించిన పత్రాలు, డీడీ రశీదులతో మందమర్రి తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అర్హతలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో తహసీల్దార్ సతీష్ శర్మతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇంద్రాపార్క్‌లో అంగరంగ వైభవంగా సదర్ సమ్మేళనం

యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా వేడుకలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల హాజరు



గండిపేట(క్రైమ్ మిర్రర్): యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతను చాటిచెప్పే సదర్ సమ్మేళనం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ యాదవ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యాదవ సోదరులు తరలివచ్చి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్సింగ్ డివిజన్ అధ్యక్షుడు, నార్సింగి మల్లన్న స్వామి దేవాలయ నిర్మాణ నిర్వహణకర్త క్యాతం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా దున్నపోతులను అందంగా అలంకరించి సమ్మేళనంలో ప్రదర్శించారు. సంప్రదాయబద్ధంగా అలంకరించిన దున్నపోతులు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాదవ సోదరులతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొని సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా క్యాతం అశోక్ యాదవ్ మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాలను తెలంగాణ రాష్ట్ర పండుగగా ప్రభుత్వం అధికారికంగా గుర్తించడం యాదవ సమాజానికి ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. తరతరాలుగా వస్తున్న యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, పశుసంపద ప్రాముఖ్యతను ప్రతిబింబించే సదర్ వేడుకలకు ప్రత్యేక గుర్తింపు లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. సదర్ సమ్మేళనం యాదవుల ఐక్యతకు, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఇలాంటి వేడుకల ద్వారా భావితరాలకు తమ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధుల హాజరుతో వేడుకలకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. సంప్రదాయ నృత్యాలు, దున్నపోతుల అలంకరణలు, యాదవ సోదరుల సందడి మధ్య ఇందిరాపార్క్ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో చౌదరి పెద్ద గొల్ల మధు యాదవ్, మాజీ ఎంపీటీసీ సాయిరాం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బోర్లు వేస్తే కఠిన చర్యలు

బోర్‌వెల్ వాహనాలు సీజ్ చేస్తాం.. కేసులు నమోదు చేస్తాం

జీఓ 259, వాల్టా చట్టంపై బోర్‌వెల్ ఆపరేటర్లకు అధికారుల హెచ్చరిక



గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అనుమతులు లేకుండా బోర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత బోర్‌వెల్ వాహనాలను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని శంషాబాద్ జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ జీఓ నంబర్ 259, వాల్టా చట్టం నిబంధనల అమలుపై బోర్‌వెల్ ఆపరేటర్లకు అవగాహన కల్పించేందుకు శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీ శంషాబాద్ సుమన్ రావు, డీటీ వాణి రెడ్డి, ఆర్ఐలు, జీపీఓలు పాల్గొని బోర్‌వెల్ ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు పొందకుండా ఎవరూ బోర్లు వేయకూడదని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా బోర్లు వేసే వారితో పాటు నిబంధనలకు విరుద్ధంగా బోర్లు వేసే పనులు చేపట్టే ఆపరేటర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా భూగర్భ జలాల పరిరక్షణ, నీటి వనరుల సక్రమ వినియోగం లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. తాగునీటి అవసరాల కోసం సొంత స్థలాల్లో బోర్‌వెల్ ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు సైతం ముందుగా సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా బోర్లు వేస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తే వాహనాల సీజ్, కేసుల నమోదు వంటి చర్యలు తీసుకుంటామని అధికారులు తేల్చిచెప్పారు. ప్రభుత్వ నిబంధనలపై బోర్‌వెల్ ఆపరేటర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు కూడా ఈ విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అనుమతులు లేకుండా బోర్లు వేయించే చర్యలకు దూరంగా ఉండాలని అధికారులు ఈ సందర్భంగా కోరారు.


కర్ణాటక రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఎస్పీతో తెలంగాణ పోలీస్ అకాడమీలో ప్రత్యేక పరస్పర సమావేశం





గండిపేట(క్రైమ్ మిర్రర్): కర్ణాటక రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ డెక్కా కిషోర బాబు బుధవారం ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్ట్ అధ్యక్షతన ఏకశిల బ్లాక్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్, అకాడమీ అభివృద్ధి, ఆధునిక శిక్షణా విధానాలు, మౌలిక సదుపాయలు, వివిధ విభాగాల్లో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులు గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, డాక్యుమెంటరీ ఫిల్మ్ ద్వారా వివరించారు. ముఖ్యంగా 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో నిర్వహించిన భారీ ఇండక్షన్ శిఓణ, వారి శిక్షణా కార్యక్రమాలు, పాసింగ్ అవుట్ పరేడ్ విశేషాలను వివరించారు. అనంతరం అకాడమీలోని వివిధ విభాగాల అధికారులు తమతమ విభాగాల పనితీరు, శిక్షణా కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. వెల్ఫేర్ విభాగం డీడీ డి.మురళీధర్ అడ్మినిస్ట్రేషన్, వసతి సౌకర్యాలు డీడీ కేఆర్‌కే ప్రసాద్, ఇన్‌సర్వీస్ కోర్సులు డీడీ జి.కవిత, ఔట్ డోర్ శిక్షణ ఏడీ భరత్, ప్రత్యేక శిక్షణా కోర్సులు ఫోరెన్సిక్ విభాగం మౌలిక సదుపాయలు డాక్టర్ ధనజ, యూనిట్ మెడికల్ సెంటర్, వైద్య సేవలు డాక్టర్ రమాదేవి ఈ సందర్భంగా కర్ణాటక ఉత్తమ శిక్షణా విధానాలు, కర్ణాటక అకాడమీలోని శిక్షణా విధానాలు, తెలంగాణ పోలీస్ అకాడమీలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులపై పరస్పర అభిప్రాయాలను పంచుకున్నారు. ఇరు రాష్ట్రాల పోలీస్ శిక్షణా సంస్థల మధ్య అనుభవాలు, విజ్ఞానం, ఉత్తమ విధానాల మార్పిడికి ఈ సమావేశం దోహదపడిందని అధికకారులు అభిప్రాయపడ్డారు. అనంతరం అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్, కర్ణాటక ఆంటెలిజెన్స్ ఎస్పీ డెక్కా కిషోర్ బాబుకు అకాడమీ తరపున జ్ఞాపికను అందజే.శారు. ఆయన అకాడమీలోని వివిధ శిక్షణా విభాగాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్, క్రీడా భవనం తదితర మౌలిక సదుపాయాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్, కర్ణాటక ఇంటెలిజెన్స్ ఎస్పీ డెక్కా కిషోర్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్లు డి.మురళీధర్, జి.కవిత, కేఆర్‌కే ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, భరత్, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, డాక్టర్ ధనజన, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, డీఎస్పీ శ్రీరాములు ఇతర విభాగాల రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

మణికొండలో భగ్గుమన్న నిరసన జ్వాలలు

ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల సమ్మెతో నిలిచిపోయిన నీటి సరఫరా

హైడ్రా, రెవెన్యూ అధికారుల తీరుపై యజమానుల తీవ్ర ఆగ్రహం



గండిపేట్, (క్రైమ్ మిర్రర్): మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని యోగా సర్కిల్ వద్ద ప్రైవేట్ నీటి ట్యాంకర్ల యజమానులు మరియు నిర్వాహకులు బుధవారం వందలాదిగా తరలివచ్చి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. హైడ్రా మరియు రెవెన్యూ అధికారులు తనిఖీల పేరుతో తమ వ్యాపారాలపై అనవసరంగా వేధింపులకు గురిచేస్తున్నారని వారు తీవ్ర ఆరోపణలు చేశారు. తాము వినియోగదారులకు అధిక ధరలకు నీటిని విక్రయించడం లేదని, నిత్యం ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడానికే సేవలు అందిస్తున్నామని స్థానిక యజమానులు స్పష్టం చేశారు. ప్రైవేట్ బోర్ల వద్దకు హైడ్రా, రెవెన్యూ అధికారులు రావద్దంటూ హెచ్చరిస్తూ అధికారుల వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

హాస్టళ్లు, నివాసితులకు తప్పని నీటి తిప్పలు

అధికారుల కఠిన నిబంధనలు మరియు వేధింపుల వల్ల స్థానిక హాస్టళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు మరియు వ్యాపార సముదాయాలు నీళ్లు లేక మూతపడే పరిస్థితి దాపురించిందని యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకుల ఆందోళన వల్ల మణికొండ ప్రాంతమంతటా నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో కాలనీవాసులు, హాస్టల్ విద్యార్థులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని, నిలిచిపోయిన నీటి సరఫరాను పునరుద్ధరించి ప్రజల కష్టాలను తీర్చాలని స్థానిక నివాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 గురువారం 5-11-2026



పరుగు పందెంలో అక్షయకు కాంస్య పతకం!

రాష్ట్రస్థాయిలో మూడో స్థానం

కేశంపేట,(క్రైమ్ మిర్రర్): మండల పరిధిలోని కాకూనూరు గ్రామానికి చెందిన అక్షయ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటింది. శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలోని ఎంజేపిటి రాజేంద్రనగర్ బ్రాంచ్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న యం అక్షయ ఇటీవల హైదరాబాద్ లో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్ జి ఎఫ్ మూడు కిలోమీటర్ల పరుగు పందెం పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి,ప్రథమ స్థానాన్ని సాధించి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది.అంతేకాక రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది.బుధవారం ఖమ్మం జిల్లాలో నిర్వహించిన మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కాంస్య పతకం (బ్రాంజ్ మెడల్) సాధించి గ్రామానికి గుర్తింపు తీసుకొచ్చిన అక్షయ విజయం పట్ల కాకూనూరు గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.పట్టుదల, కృషి, నిరంతర సాధనతో రాష్ట్రస్థాయిలో పతకం సాధించడం పట్ల పాఠశాల ప్రిన్సిపల్ జి అనిత,పిడిలు జి స్వప్న,బి శ్రావ్య,ఉపాధ్యాయ బృందం,తోటి విద్యార్థినులు క్రీడాభిమానులు అభినందనలు తెలియజేస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన మంజీర హైస్కూల్ విద్యార్థులు

పోలీసుల విధులు, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 04: ముత్తంగి రాజీవ్ నగర్‌లోని మంజీరా హైస్కూల్ కు చెందిన 4, 5వ తరగతుల సుమారు 150 మంది విద్యార్థులు విద్యా విహారయాత్రలో భాగంగా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం. రవీందర్ విద్యార్థులకు సాదర స్వాగతం పలికి, పోలీస్ స్టేషన్‌లోని అధికారులు, సిబ్బందిని పరిచయం చేశారు. పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు, బాధ్యతలను వివరించారు. అనంతరం విద్యార్థులకు క్రమశిక్షణ, రోడ్డు భద్రత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, మొబైల్ ఫోన్ల సురక్షిత వినియోగం, మంచి నడవడిక వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఎస్‌హెచ్‌ఓ ఎం. రవీందర్ చాక్లెట్లు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ జగన్, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, హమీదా, పీఈటీ మోసెస్ పాల్గొన్నారు. పోలీస్ శాఖ పనితీరు, సమాజంలో పోలీసుల పాత్ర, ప్రజల భద్రత కోసం పోలీసులు నిర్వహించే బాధ్యతలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్శన విద్యార్థులకు విజ్ఞానదాయకంగా, ఆనందదాయకంగా సాగింది.

బొంగు నరసింహ గౌడ్ దశదిన కర్మకు హాజరై నివాళులర్పించిన గుత్తా అమిత్ రెడ్డి, దైద రవీందర్

చిట్యాల క్రైమ్ మిర్రర్: చిట్యాల మండలం ఊరుమడ్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంగు శంకరయ్య గౌడ్ సోదరుడు బొంగు నరసింహ గౌడ్ ఇటీవల మృతి చెందడంతో బుధవారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, సర్పంచ్ సాగర్ల భువనేశ్వర్, బిక్షం యాదవ్, ఉపసర్పంచ్ ఉయ్యాల నరేష్, వార్డు సభ్యుడు హరిప్రసాద్, మాజీ ఎంపీటీసీ పోలగాని స్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుత్తా దేవేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు చెరుకు సైదులు, వెంకట్ రెడ్డి, చీమల వీరేశం, సత్తిరెడ్డి, జనార్దన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



నెమలి నగర్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

400 కుటుంబాలకు కనీస మౌలిక వసతులు కరువు.. బీఆర్ఎస్ నాయకుల క్షేత్రస్థాయి పర్యటన

పాఠశాల, బస్తీ దవాఖానా, రహదారులు, ఆటస్థలం దుస్థితిపై ఆరా



గండిపేట(క్రైమ్ మిర్రర్): దశాబ్దాలుగా నివసిస్తున్నా కనీస మౌలిక వసతులకు నోచుకోని నెమలి నగర్ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. నెమలి నగర్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, 60 గజాల స్థలంలో నివసిస్తున్న సుమారు 400 కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు బుధవారం బీఆర్ఎస్ మణికొండ, నెక్నంపూర్ నాయకులు స్థానిక ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల, ఆటస్థలం, బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రం తదితర ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు అందాల్సిన విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, రహదారులు, సంక్షేమ సదుపాయాలు ఏ మేరకు అందుతున్నాయో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనేక సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నెమలి నగర్‌లో గత ఆరేళ్లకు పైగా ఆస్తుల మదింపు చేపట్టకపోవడం, ఇళ్లకు అధికారిక ఇంటి నంబర్లు కేటాయించకపోవడం వల్ల మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని నాయకులు పేర్కొన్నారు. వెంటనే ఆస్తుల సర్వే, మదింపు చేపట్టి ప్రతి ఇంటికి నంబర్లు కేటాయించి పన్నుల వసూలు ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి నెమలి నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి బిల్డర్ల నిర్మాణ పనుల కోసం భారీ వాహనాలు తిరగడంతో పూర్తిగా దెబ్బతిన్నదని స్థానికులు తెలిపారు. గుంతలమయమైన రహదారిపై నిత్యం ప్రయాణించే ప్రజలు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రహదారిని తక్షణమే పునరుద్ధరించడంతో పాటు, రహదారి ధ్వంసానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రాలకు కనీసం నీటి సరఫరా కనెక్షన్లు కూడా లేకపోవడం విచారకరమని నాయకులు అన్నారు. బస్తీ దవాఖానాలో రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు, దుర్వినియోగం జరగకుండా సెక్యూరిటీ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. దవాఖానాలో అందుబాటులో ఉండాల్సిన 52 రకాల నిర్ధారణ పరీక్షలకు బదులుగా కేవలం 23 పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారని, ఎంబీబీఎస్ వైద్యుడు కూడా అందుబాటులో లేరని తెలిపారు. వెంటనే పూర్తిస్థాయి వైద్యుడిని నియమించి, నిర్దేశిత 52 రకాల పరీక్షలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో సుమారు 90 మంది విద్యార్థులు తాత్కాలిక రేకుల షెడ్లలో విద్యనభ్యసించడం ఆందోళనకరమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. వర్షాకాలం, వేసవికాలంలో విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అన్ని సౌకర్యాలతో కూడిన శాశ్వత పక్కా పాఠశాల భవనాన్ని నిర్మించాలని కోరారు. పిల్లలు ఆడుకోవాల్సిన ఆటస్థలం నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి నిరుపయోగంగా మారిందని నాయకులు తెలిపారు. ఈ సమస్యను అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. వెంటనే నిర్మాణ వ్యర్థాలను తొలగించి, ఆటస్థలాన్ని అభివృద్ధి చేసి, నిరంతర నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సరైన నిర్వహణ లేకపోవడంతో ఇందిరమ్మ ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే స్థానికంగా రేషన్ షాపు లేకపోవడంతో నిత్యావసర సరుకుల కోసం ప్రజలు నార్సింగి లేదా పుప్పాలగూడకు వెళ్లాల్సి వస్తోందని, ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు నెమలి నగర్‌లోనే రేషన్ షాపు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతంలో కనీసం తాగునీరు, వైద్యం, విద్య, రహదారులు, ఆటస్థలం వంటి మౌలిక సదుపాయాలు కూడా సక్రమంగా లేకపోవడం బాధాకరం. ప్రజలు పన్నులు చెల్లిస్తున్నప్పటికీ వారికి అందాల్సిన సౌకర్యాలు అందడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలి అని అన్నారు. నెమలి నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో బీఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, గోరుకంటి విఠల్, అందె లక్ష్మణ్ రావు, యాలాల కిరణ్, సుమనళిని, షేక్ ఆరిఫ్, షకీలా రెడ్డి, రాజేంద్ర ప్రసాద్, బాబు రావుతో పాటు స్థానికులు అశోక్, శ్రీనివాసు, మల్లేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పెద్దపూరు మోడల్ స్కూల్‌లో ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

బాలికల కలలకు రెక్కలు తొడిగితేనే దేశానికి నిజమైన సశక్తత





పెద్దపల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ బ్యూరో,నవంబర్ 04: పెద్దపల్లి జిల్లా,జూలపల్లి మండలం పెద్దపూరులోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సరికొత్త కోణంలో ఘనంగా ముగిసింది.చేతిలో పుస్తకం,కళ్లలో పెద్ద కలలు,గుండెల్లో ఆత్మవిశ్వాసం ఉంటే ఏ అమ్మాయైనా ప్రపంచాన్ని మార్చగలదు" అనే స్ఫూర్తిదాయకమైన సందేశంతో మహిళా శిశు సంక్షేమ శాఖ, పెద్దపల్లి జిల్లా మహిళా సాధికారత కేంద్ర బృందం సంయుక్త ఆధ్వర్యంలో"జాగరూక్ బచ్పన్ – సశక్త భారత్" అనే సరికొత్త థీమ్‌తో నిర్వహించిన ఈ వేడుక విద్యార్థినులలో చైతన్య దీపాలు వెలిగించింది.పాఠశాల ప్రిన్సిపాల్ సరిత అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

సదస్సులో చర్చించిన ముఖ్యాంశాలు

ద'జీవిత పాఠాలు' రక్షణే కవచం (టోల్ ఫ్రీ నంబర్లు):అమ్మాయిలకు ఎలాంటి ఆపదొచ్చినా భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అందించే ముఖ్యమైన రక్షణ నంబర్లను విద్యార్థినులకు పరిచయం చేశారు.1098 (బాలల రక్షణ),181 (మహిళల భద్రత),14416 (టెలి-మానస్ ఒత్తిడి నివారణ),155326 (సైబర్ సేవలు),15100 (ఉచిత న్యాయ సహాయం),14567 (వృద్ధుల రక్షణ) సేవలపై అవగాహన కల్పించారు.

బాలల చట్టాలు-హక్కులు

పోక్సో చట్టంపై సమగ్ర అవగాహన కల్పిస్తూ,బాలికలు తమ హక్కులను తెలుసుకుని ఆత్మరక్షణతో ఎలా మెదలాలో వివరించారు.

ఉన్నత విద్య ద ఉపాధి అవకాశాలు

పాఠశాల విద్య పూర్తయిన తర్వాత ఎంచుకోవాల్సిన ఉన్నత చదువులు,కోర్సులు,ప్రవేశ పరీక్షలు,స్కాలర్‌షిప్‌లు మరియు ప్రభుత్వ ప్రోత్సాహకాలపై స్పష్టతనిచ్చారు.అంతేకాకుండా, 'తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్' (టాస్క్) ద్వారా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించే మార్గాలను సూచించారు.

ఆరోగ్యం మరియు వ్యక్తిగత పరిశుభ్రత

టీనేజ్ దశలో వచ్చే శారీరక మార్పులు,వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు చదువుల ఒత్తిడిని జయించేందుకు సులువైన మానసిక సూత్రాలను పంచుకున్నారు.

ఆర్థిక అక్షరాస్యత ద సమానత్వ భావన

చిన్ననాటి పొదుపుతో భవిష్యత్తును ఎలా భద్రపరుచుకోవాలి,సమాజంలో లింగ వివక్షను పక్కన పెట్టి స్త్రీ-పురుషులు సమానమే అనే భావనను చిన్ననాడే ఎలా అలవాటు చేసుకోవాలనే అంశాలపై విద్యార్థినులను ఆలోచింపజేశారు.

పోటీలు మరియు బహుమతుల ప్రదానం

ఈ వేడుకల సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన మరియు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటగా,విజేతలకు బహుమతులు అందజేశారు."అమ్మాయిలు కేవలం చదువుకోవడం కాదు, సమాజాన్ని నడిపించే శక్తిగా ఎదగాలి" అనే బలమైన నినాదంతో ముగిసిన ఈ కార్యక్రమం విద్యార్థులకు మరపురాని అనుభూతిని మిగిల్చింది. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్ర బృందం భూపల్లి సంస్కృతి, రామరాజు మరియు సోనియా,ప్రిన్సిపాల్ సరిత,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కరెంటు.. నీళ్లు పొదుపుగా వాడాలి!

ఎల్నినో ముప్పుపై ఇందారం గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం

జైపూర్ నవంబర్ 4 (క్రైమ్ మిర్రర్): ఎల్నినో ప్రభావంతో రానున్న రోజుల్లో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇందారం గ్రామసభ తీర్మానించింది. నీరు, విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. బుధవారం జైపూర్ మండలం ఇందారం గ్రామపంచాయతీ కార్యాలయం లో గ్రామసభ నిర్వహించారు.ఈ సమావేశానికి ఎంపీడీవో బాపురావు హాజరయ్యారు. ఎల్నినో ప్రభావం, కరువు ముప్పుపై ప్రజలకు అవగాహన కల్పించేలా సర్పంచ్ మహమ్మద్ ఫయాజుద్దీన్, ఎంపీడీవో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరువును ఎదుర్కోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. నీరు, విద్యుత్‌ను అవసరానికి మించి వినియోగించకుండా పొదుపు చేయాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని, పశువుల తాగునీటి కోసం తొట్టెలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్కాటూరి శివ, ఎంఈవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజమల్లయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి స్రవంతి, వీబీజీ రాంజీ ఏపీవో బాలయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

జయశ్రీ కాలనీలో దారుణం కత్తితో దాడి ఇద్దరు దుర్మరణం

బాలాపూర్ క్రైమ్ మిర్రర్: మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి కత్తితో కుటుంబ సభ్యులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మీర్‌పేట్‌లోని జయశ్రీ కాలనీలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఆగ్రహానికి గురైన అల్లుడు పదునైన కత్తితో అత్త నిరంజన్ బీ, బావమరిది భార్య రేష్మపై దాడి చేయడంతో వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో నిందితుడి భార్య, కుమార్తెతో పాటు బావమరిది యూసుఫ్ తీవ్రంగా గాయపడ్డారు. యూసుఫ్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టినట్లు సమాచారం.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
గురువారం 5-11-2026
7

డ్రగ్స్ వద్దు - ఆరోగ్యమే ముద్దు..!

మహేశ్వరంలో మార్మోగిన నశా ముక్త్ నినాదం...!

మోడల్ కాలేజీలో మై భారత్ ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన -యూత్ పార్లమెంట్

యువత చేతిలో డ్రగ్స్ కాదు - పుస్తకాలు ఉండాలి -ఎస్ఐ మారయ్య







మహేశ్వరం: ప్రతినిధి క్రైమ్ మిర్రర్: మహేశ్వరంలో నశా ముక్త్ భారత్ – డ్రగ్ ఫ్రీ భారత్" నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మహేశ్వరం ఎస్ఐ మారయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలోని మోడల్ కాలేజీలో మై భారత్ ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన మరియు యూత్ పార్లమెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎస్ఐ మారయ్య, పూర్వ ఏబీవీపీ నాయకులు దేవేందర్, కళాశాల ప్రిన్సిపాల్ గోపి, మై భారత్ కో-ఆర్డినేటర్ ముయ్యాడ శివ కుమార్, తిక్కల మణికుమార్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా

ఎస్ఐ మారయ్య మాట్లాడుతూ...

మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి యువతను కాపాడుకొని ఆరోగ్యవంతమైన, శక్తివంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. డ్రగ్స్ వినియోగం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా అతని కుటుంబాన్ని, సమాజాన్ని, చివరకు దేశ భవిష్యత్తును కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. యువతే దేశానికి భవిష్యత్తు. యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. డ్రగ్స్ కు బానిసైన యువతను నిందించడం పరిష్కారం కాదు. వారికి సరైన అవగాహన, కుటుంబ సహకారం, కౌన్సెలింగ్ అందించి తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావాలి" అని పేర్కొన్నారు. క్షణికమైన మత్తు కోసం అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ స్నేహపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. యువత క్రీడలు, విద్య, సామాజిక సేవ వైపు దృష్టి సారించాలన్నారు.

ప్రజల సహకారం అవసరం: మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టడంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. పరిసరాల్లో డ్రగ్స్ అందించే ముఠాలు, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే బాధ్యతాయుతంగా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.మన యువత చేతిలో డ్రగ్స్ కాదు – పుస్తకాలు ఉండాలి. మత్తు పదార్థాలు కాదు – వారి మనసులో గొప్ప లక్ష్యాలు ఉండాలి. నేటి యువతను డ్రగ్స్ నుంచి కాపాడుకోవడం అంటే రేపటి భారతదేశాన్ని కాపాడుకోవడమే" అని ఎస్ఐ మారయ్య పేర్కొన్నారు.డ్రగ్స్ వద్దు – ఆరోగ్యమే ముద్దు. మత్తుకు నో చెప్పుదాం – జీవితానికి యెస్ చెప్పుదాం అనే నినాదాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వివిధ సంఘాల నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కాటేదాన్ డివిజన్‌లో ముమ్మరంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు: ఫారం-18 దరఖాస్తులు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

గండిపేట్, క్రైమ్ మిర్రర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాలనీలో పర్యటించి, డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్సీ ఓటరు నమోదు ఉచిత ఫారం-18 దరఖాస్తులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల ఓటు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. డిగ్రీ పూర్తయిన పట్టభద్రులు తమ ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా ఫారం-18 పూర్తి చేసి, అవసరమైన ధ్రువపత్రాలతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. యువత సాధికారతకు, కాలనీల సమగ్ర అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నోముల రాము యాదవ్, రాజేష్ యాదవ్, అశోక్, మహేష్ రెడ్డి, దుర్గా ప్రసాద్, బాల్ రాజ్ యాదవ్, సురేందర్, కుమార్, బాలరాజ్, భాస్కర్,వి. రాజు, ప్రసాద్, నవీన్, వినేష్, అరుణ్, విఠల్, అనిల్, వెంకట్ రమణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణపై రెయిన్‌బో స్కూల్ యాజమాన్యం ఆంక్షలు

మాల ధరించిన విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించని వైనం

హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతీశారంటూ అయ్యప్ప స్వాముల ఆగ్రహం


స్కూల్ గేటు ఎదుట స్వాముల నిరసన.. ఎంఈఓ, పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం





అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 04: అయ్యప్ప మాలధారణ చేసిన విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించకుండా రెయిన్‌బో స్కూల్ యాజమాన్యం అడ్డుకోవడం అమీన్‌పూర్ పరిధిలో తీవ్ర వివాదానికి దారితీసింది. బీరంగూడ ప్రధాన రహదారిపై ఉన్న రెయిన్‌బో పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటనతో అయ్యప్ప భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలధారణ చేసిన విద్యార్థులతో పాటు బస్సు డ్రైవర్లను సైతం పాఠశాలలోకి అనుమతించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు పాఠశాల వద్దకు చేరుకున్నారు. పాఠశాల ప్రధాన గేటు ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. అయ్యప్ప మాలధారణ అనేది భక్తి, నియమ నిష్ఠలు, ఆధ్యాత్మిక విశ్వాసాలతో కూడుకున్నదని, అటువంటి పవిత్ర మాల ధరించిన విద్యార్థులను పాఠశాలలోకి రానివ్వకపోవడం సరికాదని స్వాములు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మాలధారణలో ఉన్నారనే కారణంతో విద్యకు దూరం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పాఠశాల యాజమాన్యం వ్యవహరించిన తీరుతో హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలధారణ చేసిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాలలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు.ఈ క్రమంలో పాఠశాల గేటు వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న అమీన్‌పూర్ ఎస్ఐ విజయరావు, మండల విద్యాధికారి సుధాకర్ వెంటనే పాఠశాల వద్దకు చేరుకున్నారు. నిరసన చేపడుతున్న అయ్యప్ప స్వాములతో మాట్లాడి వారి అభ్యంతరాలను తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల యాజమాన్యంతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించారు.విద్యార్థుల విద్యకు ఆటంకం కలగకుండా చూడాలని, మాలధారణ చేసిన కారణంగా వారిని పాఠశాలకు దూరం చేయకూడదనే అంశంపై అధికారులు యాజమాన్యంతో చర్చించినట్లు తెలిసింది. చివరకు అధికారుల జోక్యంతో యాజమాన్యం మాలధారణ చేసిన విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించేందుకు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది. దీంతో నిరసన విరమించిన అయ్యప్ప స్వాములు అక్కడి నుంచి వెనుదిరిగారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా అధికారులు సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించడంతో పాఠశాల వద్ద నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు తొలగిపోయాయి.

ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్‌గా గూడూరు శ్రీనివాసరెడ్డి నియామకం



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్‌గా కడ్తాల్ మాజీ ఎంపీటీసీ, డీసీసీ ఉపాధ్యక్షులు గూడూరు శ్రీనివాసరెడ్డి నియమితుల య్యారు. తనకు అప్పగించిన బాధ్యత లను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సింగిల్ విండో పరిధిలోని రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని గూడూరు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. కడ్తాల్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ, పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తున్న గూడూరు శ్రీనివాసరెడ్డికి ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్ బాధ్యతలు దక్కడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ శు భాకాంక్షలు తెలియజేశారు. తనకు కీలక బాధ్యతలు అప్పగించేందుకు కృషి చేసిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి గూడూరు శ్రీనివాసరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత పాత్ర కీలకం

ఘనంగా డివైఎఫ్ఐ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

దేశ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత ముందుకు రావాలి

డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నన్నెపొంగు రమేష్

క్రైమ్ మిర్రర్, పాలకీడు : దేశ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత ముందుకు రావాలనీ డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నన్నెపొంగు రమేష్ అన్నారు.భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పాలకీడు లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాలకీడు మండల కార్యదర్శి నన్నెపొంగు రమేష్ పాల్గొని సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత, లౌకికత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం డివైఎఫ్ఐ ఆవిర్భావం నుంచి నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు యువత ముందుకు రావాలని రమేష్ పిలుపునిచ్చారు. దేశంలో మత సామరస్యం, సామాజిక న్యాయం, సమానత్వం, సోదరభావం నెలకొల్పేందుకు యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం" అనే నినాదంతో దేశ ఐక్యతను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో నిరుద్యోగం, పేదరికం, ధరల పెరుగుదల, విద్యారంగ సమస్యలు, వైద్య సదుపాయాల కొరత వంటి అనేక సమస్యలు యువతను తీవ్రంగా వేధిస్తున్నాయని ఆయన అన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు ప్రజల అసలు సమస్యలను పక్కనపెట్టి మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య విభజనలు సృష్టించడం సరికాదన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేటు రంగంలో ఉద్యోగ భద్రత కల్పించాలని, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించాలని నన్నెపొంగు రమేష్ డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, వసతి సదుపాయాలు సమయానికి అందించాలని అన్నారు. భగత్‌సింగ్, చేగువేరా ఆశయాలను ఆదర్శంగా తీసుకొని యువతలో శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యత, ప్రశ్నించే తత్వం పెంపొందించేందుకు డివైఎఫ్ఐ కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పగడాల మట్టేష్,చంటి , కమలహాసన్,రేవూరి కిరణ్ ,రమేష్ , వెంకటేశ్వర్లు,ఎల్లయ్య తదితరులు పాల్గోన్నారు.



క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 గురువారం 5-11-2026




మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసిన యూసుఫ్ లల్లూ

కమాన్‌పూర్ మండల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన పెద్దపల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ యూసుఫ్ లల్లూ

పెద్దపల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ నవంబర్ 4: న్యూస్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును పెద్దపల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ యూసుఫ్ లల్లూ బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రితో పలు స్థానిక అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కమాన్‌పూర్ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్థానికంగా నెలకొన్న అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. మండలంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరినట్లు తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని యూసుఫ్ లల్లూ పేర్కొన్నారు. కమాన్‌పూర్ మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి కొనసాగిస్తానని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబుతో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ ద్వారా మండలంలోని స్థానిక సమస్యలను ప్రభుత్వ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు యూసుఫ్ లల్లూ వెల్లడించారు.

నార్సింగి ప్రభుత్వ ఆసుపత్రిలో అధికారుల నిర్లక్ష్యం: మాజీ కౌన్సిలర్ ఉషారాణి తీవ్ర ఆగ్రహం





గండిపేట్, క్రైమ్ మిర్రర్: నార్సింగి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుర్కొంటున్న దయనీయ పరిస్థితి మరియు అధికారుల నిర్లక్ష్యంపై మాజీ కౌన్సిలర్ ఉషారాణి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో కనీస మౌలిక సదుపాయాలు లేక వ్యాక్సిన్ల కోసం వచ్చే మహిళలు, చిన్న పిల్లల తల్లులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం తాగునీరు, కూర్చోవడానికి కుర్చీలు కూడా అందుబాటులో లేవని విమర్శించారు. డెలివరీలు జరిగే గదిలోనే పిల్లలకు వ్యాక్సిన్లు వేస్తున్నారని, గడిచిన కొన్ని నెలలుగా ఆసుపత్రిలో ఒక్క ప్రసవం కూడా జరగలేదని ఆరోపించారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత డాక్టర్లు, సరైన సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని, ఈసీజీ, స్కానింగ్ సేవలు నిలిచిపోయాయని తెలిపారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో సెక్యూరిటీ లేకపోవడంతో ఆసుపత్రి ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు, గంజాయి, సిగరెట్లు తాగేందుకు స్థావరంగా మారిందని మండిపడ్డారు. ఉచితంగా చేయాల్సిన పరీక్షల కోసం పేషెంట్లను బయట ప్రైవేట్ డయాగ్నోస్టిక్ కేంద్రాలకు పంపిస్తూ కమిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. గతంలో ఎంతో పేరున్న ఈ ప్రభుత్వాసుపత్రి పట్ల నిర్లక్ష్యం వహించకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తక్షణమే స్పందించి 100 పడకల సివిల్ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

దొంగలు బాబోయ్ దొంగలు





రంగాపురం గ్రామంలో వరుస దొంగతనాలు...!
మొన్న రెండు ఇళ్లలో చోరీ...!
నిన్న రాత్రి తొమ్మిది ఇళ్లలో దొంగల హల్‌చల్..!
రంగంలోకి దిగిన పోలీసులు...
గ్రామంలో దొంగతనాల కలకలం..

వనపర్తి నవంబర్ 04 క్రైమ్ మిర్రర్: వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. గ్రామంలోని సుమారు తొమ్మిది ఇళ్లలో దొంగలు చొరబడి వస్తువులను చిందరవందర చేసినట్లు సమాచారం. అయితే చిన్నచిన్న వస్తువులు మినహా పెద్ద మొత్తంలో నగదు, విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు ప్రాథమికంగా తెలియరాలేదు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సీఐ ఓడీ రమేష్, పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ గ్రామానికి చేరుకుని క్లూస్ టీమ్‌తో కలిసి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. దొంగతనాలకు సంబంధించిన ఆధారాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఒకేసారి తొమ్మిది ఇళ్లలో దొంగలు ప్రవేశించడంతో గ్రామ ప్రజల్లో ఆందోళన నెలకొంది. సందర్భంగా సీఐ ఓడీ రమేష్, ఎస్ఐ వెంకటేష్ గౌడ్ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, విలువైన వస్తువులు, నగదును భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఇంత జరుగుతున్నా పట్టించుకునేది ఎవరు..?

గ్రామంలో తొమ్మిది ఇళ్లలో దొంగలు చొరబడి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నప్పటికీ గ్రామ సర్పంచ్ నుంచి ఎలాంటి స్పందన లేదంటూ స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ ప్రజల భద్రత, రక్షణ విషయంలో గ్రామ నాయకత్వం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా గ్రామంలో భద్రతా చర్యలు చేపట్టి, రాత్రివేళల్లో నిఘా పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కానీ గ్రామ సర్పంచ్ ఏం చేస్తున్నారు?.. ఇంత జరుగుతున్న పట్టించుకునేది ఎవరు...?

రంగాపురం గ్రామంలో మొన్నటికి మొన్న రెండు ఇళ్లలో చోరీ, నిన్న రాత్రి ఏకంగా తొమ్మిది ఇళ్లలో దొంగలు చొరబడి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నప్పటికీ గ్రామ సర్పంచ్ నుంచి ఎలాంటి స్పందన లేదంటూ స్థానికంగా ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. గ్రామ ప్రజల భద్రత ప్రవచన విషయంలో గ్రామ నాయకత్వం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామంలో ఇంత పెద్ద ఘటన జరిగినా గ్రామ సర్పంచ్ నుంచి ఎలాంటి స్పందన లేదు. బాధిత కుటుంబాలను పరామర్శించలేదు. గ్రామంలో నిఘా పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాత్రి వేళల్లో కాపలా, సీసీ కెమెరాలు ఉన్నా అవి పని చేయడం లేదు. వాటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు అంటూ గ్రామస్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామానికి పెద్ద దిక్కుగా ఉండాల్సిన సర్పంచ్ బాధ్యతగా వ్యవహరించాలని, ఇప్పటికైనా గ్రామంలో రాత్రి కాపలా ఏర్పాటు చేసి, పోలీసులతో కలిసి భద్రతా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఫ్యూచర్ సిటీలో 244 గుర్తింపు లేని వాహనాలకు వేలం





యజమానులకు 6 నెలల గడువు
హక్కుదారులు లేని వాహనాలపై పోలీసుల కీలక నిర్ణయం..!
మొయినాబాద్ పీఎస్ గ్రౌండ్ లో ఉన్న వాహనాల వివరాలు వెబ్ సైట్ లో..!

ఫీచర్ సిటీ ప్రతినిధి(క్రైమ్ మిర్రర్): ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గుర్తించిన 244 గుర్తింపు లేని వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. వివిధ కంపెనీలు, మోడళ్లకు చెందిన ఈ వాహనాలు ప్రస్తుతం మొయినాబాద్ పోలీస్ స్టేషన్ గ్రౌండ్స్‌లో ఉన్నాయి. ఫ్యూచర్ సిటీ పోలీస్ చట్టం-2026లోని సెక్షన్లు 6(2), 7 తో పాటు హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టంలోని సెక్షన్లు 39, 40, 41 ప్రకారం చట్టపరమైన విధానాలను అనుసరించి ఈ వాహనాలను ఆన్‌లైన్ లేదా బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు.

యజమానులకు 6 నెలల గడువు: ఈ వాహనాల అసలు యజమానులు, చట్టబద్ధమైన హక్కుదారులు, వాహనాలపై రుణ సంబంధిత హక్కులు (హైపోథికేషన్) కలిగిన వారికి తమ హక్కులను నిరూపించుకునేందుకు నోటీసు ప్రచురించిన తేదీ నుంచి ఆరు నెలల గడువు ఇచ్చారు. సంబంధిత వ్యక్తులు తమ వాహన యాజమాన్యాన్ని నిర్ధారించే సరైన పత్రాలు, ఆధారాలతో కూడిన దరఖాస్తును ఆరు నెలల్లోగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌కు సమర్పించాల్సి ఉంటుంది. నిర్దేశించిన గడువులోగా ఎలాంటి చెల్లుబాటు అయ్యే హక్కు దావాలు లేదా అభ్యంతరాలు అందకపోతే, సంబంధిత వాహనాలను చట్ట నిబంధనల ప్రకారం బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తారు.

సంప్రదించాల్సిన వివరాలు: వాహనాల వివరాలు, ఇతర సమాచారం కోసం ఫ్యూచర్ సిటీ సి ఎ ఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎం టి ఓ గా పనిచేస్తున్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సుబ్రహ్మణ్యంని 8712670664 నంబర్‌లో సంప్రదించవచ్చు. 244 వాహనాల పూర్తి జాబితాను ఫ్యూచర్ సిటీ పోలీస్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

వెబ్‌సైట్: https://www.tspolice.gov.in/future-city

వాహన యజమానులు వెబ్‌సైట్‌లోని జాబితాను పరిశీలించి, తమ వాహనాలు ఉన్నట్లయితే గడువులోగా సరైన ఆధారాలతో హక్కు దావాలను సమర్పించాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ విజ్ఞప్తి చేసింది.

క్యాతనపల్లిలో పారిశుధ్య కార్మికుల నిరసన..

జవాన్ శ్రీనివాస్‌ను తొలగించాలని డిమాండ్
గతంలోనూ ఫిర్యాదులు.. మళ్లీ బాధ్యతలు అప్పగించడంపై ఆగ్రహం
కార్యాలయం ఎదుట బైఠాయింపు

రామకృష్ణాపూర్ నవంబర్ 4 (క్రైమ్ మిర్రర్): క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్య, విద్యుత్, తాగునీటి సరఫరా విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. విధులను బహిష్కరించి కార్యాలయం ఎదుట బైఠాయించారు. మున్సిపాలిటీ పారిశుధ్య విభాగంలో జవాన్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ వ్యవహారశైలిపై కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళా కార్మికులు పని ప్రదేశాల్లో ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తే కనీస మర్యాద లేకుండా అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. విధి నిర్వహణలో నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో ఫిర్యాదు చేసినా మారని తీరు..

శ్రీనివాస్ వ్యవహారశైలిపై గతంలోనే పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు ఆయన్ను ఆ బాధ్యతల నుంచి తప్పించి మరో వ్యక్తిని జవాన్‌గా నియమించారు. అయితే కొద్ది రోజులకే తిరిగి శ్రీనివాస్‌కే బాధ్యతలు అప్పగించారని కార్మికులు ఆరోపించారు. దీంతో మళ్లీ పనుల కేటాయింపు పేరుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. జవాన్ శ్రీనివాస్‌ను ఆ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించి మరో వ్యక్తిని నియమించాలని కార్మికులు డిమాండ్ చేశారు.



ఈ నిరసనకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. మున్సిపల్ పాలకవర్గం, కౌన్సిలర్లు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. భవిష్యత్తులో కార్మికులను ఇబ్బందులకు గురిచేయబోమని అధికారులు లిఖితపూర్వక హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
గురువారం 5-11-2026
9

సర్ రద్దు, కరువు సహాయక చర్యలకై
కార్పొరేట్ వ్యతిరేక పోరు

- దేశ వ్యాప్తంగా 'పీపుల్స్ ఎగైనెస్ట్ ఎస్ఐఆర్' పేరుతో పోరాటం
- జ్ఞానేష్ కుమార్ రాజీనామా, 13 కోట్ల ఓట్ల పునరుద్ధరణే లక్ష్యం
- కరువు కోరల్లో దేశం - కరిగిపోతున్న సబ్సిడీలు
- వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోదీ
- డిసెంబర్ లో 'మార్చ్ టు గోడౌన్స్'
- గోడౌన్లు బద్దలు కొట్టి ప్రజలకు బియ్యం పంపిణీ చేస్తాం
- అసైన్డ్ భూముల పక్కదారి
- 22ఏ పేరుతో 25 లక్షల ఎకరాల పేదల భూముల వేలం
- సర్ తో 13 కోట్ల ఓట్లు రద్దు
- రద్దయిన ఓట్లలో అత్యధికంగా వ్యవసాయ కార్మికులు, దళితులు, వలస కార్మికులు, ముస్లింలు
- సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు
- దామాషా పద్ధతిలో ఎన్నికల సంస్కరణలు తీసుకురావాలి
- ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే మరింత కరవు
- నల్గొండ రైతు మహాసభలకు లక్ష మందితో భాగస్వామ్యం
- ఫిబ్రవరి లో బెంగుళూరు లో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలు
- విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం అల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ వెల్లడి



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: దేశంలో ఎస్ఐఆర్ (సర్) వ్యవహారానికి వ్యతిరేకంగా, జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ తమ సంఘం భాగస్వామ్యం తో సుదీర్ఘకాలంగా ఉద్యమం సాగుతోందని వ్యవసాయ కార్మిక సంఘం అల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ తెలిపారు.ఈ ఉద్యమానికి వ్యవసాయ కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ప్రత్యక్ష భాగస్వామ్యం వహిస్తుందని చెప్పారు. బుధవారం ఖమ్మం లోని సుందరయ్య భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగిన పొరపాట్లను దిద్దుకోవడానికి బదులుగా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు అసలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఉన్నత స్థానాల్లో ఉన్న నాయకులు కూడా దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. . దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లు రద్దయిన తరుణంలో, అందులో విదేశీ చొరబాటుదారులు ఎంతమంది ఉన్నారో, వారిలో ఎంతమందిని దేశం వెలుపలికి పంపించారో కేంద్ర హోంశాఖ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.రద్దయిన ఓట్లలో అత్యధికంగా వ్యవసాయ కార్మికులు, దళితులు, వలస కార్మికులు, ముస్లింలు వంటి దేశ ఉత్పత్తి ప్రక్రియలో కీలక పాత్ర పోషించే శ్రమజీవులవే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నివాస స్థలం మారినంత మాత్రాన ఓటు హక్కును రద్దు చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, దానికి భిన్నంగా వ్యవహరించడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. భారత రాజ్యాంగం అందించిన ఫార్మ్ నంబర్ 6 ని ఎలక్షన్ కమిషన్ తన పరిధి దాటి మార్చడం సముచితం కాదని పేర్కొన్నారు . బీజేపీకి ప్రజల్లో నమ్మకం తగ్గిపోవడం వల్లే, నేరుగా గెలవలేమనే భయంతో ఇలా ఓట్లను తొలగించే కుట్రలు కేంద్ర ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు . గతంలో నియంతృత్వ ధోరణులను, ఇందిరా గాంధీ వంటి నాయకులను సైతం ఓడించిన ఘనత భారత ప్రజాస్వామ్యానికి ఉందని గుర్తుచేస్తూ, మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేయకుండా రద్దు చేసే కుట్రలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం 'పీపుల్స్ ఎగైనెస్ట్ ఎస్ఐఆర్' పేరుతో రాజకీయ రహితంగా వేలాది సంఘాలు, వ్యక్తులతో విశాల ఐక్యవేదిక ఏర్పడిందని, ఎస్ఐఆర్ రద్దు చేయడం, జ్ఞానేష్ కుమార్ రాజీనామాతో పాటు ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం, తొలగించిన 13 కోట్ల ఓట్లను పునరుద్ధరించడం, అలాగే దామాషా పద్ధతిలో ఎన్నికల సంస్కరణలు తీసుకురావడం తమ ప్రధాన డిమాండ్లని స్పష్టం చేశారు.

?దేశంలో గత 50 ఏళ్లలో ఎన్నడూ లేనంత తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని, దాదాపు సగం దేశం కరువు కోరల్లో చిక్కుకుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎల్ నినో వల్ల ప్రకృతిపరంగా కొంత కరువు ఏర్పడితే, ప్రభుత్వాల నిర్లక్ష్యం, తప్పుడు విధానాల వల్ల మిగతా కరువు తీవ్రతరమైందని వివరించచారు . కరువును అధిగమించేందుకు ప్రకృతి వైపరీత్యాల సహాయ చర్యలు చేపట్టడంతో పాటు ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తక్షణమే మార్చుకోవాలని డిమాండ్ చేశారు . బీజేపీ అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగాన్ని సంపూర్ణంగా కార్పొరేటీకరణ చేస్తూ, కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు . రైతాంగానికి అందించే సబ్సిడీలను కేంద్రం క్రమంగా ఉపసంహరించుకుంటోందని . నాలుగేళ్ల క్రితం బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీకి రూ. 2.95 లక్షల కోట్లు కేటాయిస్తే, ప్రస్తుతం దాన్ని రూ. 1.90 లక్షల కోట్లకు, అంటే దాదాపు లక్ష కోట్ల రూపాయలకు తగ్గించి రైతులపై భారం మోపారని తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అతిపెద్ద సవాలుగా మారిందన్నారు.

?మరోవైపు దేశంలో, రాష్ట్రంలో నిత్యావసరాలు, ఆహార ధాన్యాల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు . గతంలో రూ. 60 ఉన్న బియ్యం ధర ప్రస్తుతం రూ. 95కి చేరగా, మిగిలిన నిత్యావసర ధరలు 200 నుండి 300 శాతం వరకు పెరిగాయని తెలిపారు. పంట దిగుబడి తగ్గడం వల్ల ఈ ధరలు పెరగలేదని, నాలుగేళ్ల క్రితం 28 కోట్ల మెట్రిక్ టన్నులుగా ఉన్న ధాన్యాల ఉత్పత్తి, ప్రస్తుతం 34 నుండి 35 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగి రికార్డు స్థాయికి చేరిందని పేర్కొన్నారు. నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ ధరలు పెరగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారులకు, కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాయడమే ప్రధాన కారణమని ఆరోపించారు . ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇద్దరూ కలిసి వ్యాపారులకు లబ్ధి చేకూరుస్తూ ప్రజలపై వేల కోట్ల రూపాయల భారం మోపుతున్నారని విమర్శించారు . ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వద్ద సాధారణంగా ఉండాల్సిన 3 కోట్ల టన్నుల బఫర్ స్టాక్ కంటే రెట్టింపుగా, అంటే 6 కోట్ల టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, నిల్వలు ఎక్కువగా ఉన్నప్పుడు ప్రజలకు పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితంగా లేదా తక్కువ ధరకు అందించాల్సి ఉండగా, ప్రభుత్వం ఆ పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. పేద కుటుంబాలకు రేషన్ ద్వారా ఇచ్చే బియ్యాన్ని 5 కేజీల నుండి 10 కేజీలకు పెంచాలని డిమాండ్ చేశారు. వ్యాపారుల వద్ద లంచాలు తీసుకుంటూ ఓట్లు కొనుగోలు చేస్తూ, ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వాలు సహకరిస్తున్నాయని విమర్శించారు . రూ. 95 కిలో బియ్యం విక్రయిస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, బహిరంగ మార్కెట్లో ధాన్యాల విడుదలకు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వాలు బ్లాక్ మార్కెట్ చేస్తూ ధరలు పెంచే వ్యాపారులపై పీడీ యాక్టు, ఊపా యాక్టుల వంటి కఠిన చట్టాలను ప్రయోగించాలని డిమాండ్ చేశారు .

గోడౌన్ల ముట్టడిస్తాం

కరువు సహాయక చర్యల కోసం తక్షణమే రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరుకుల కోటాను రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే డిసెంబర్ నెలలో "మార్చ్ టు గోడౌన్స్" (గోడౌన్ల ముట్టడి) కార్యక్రమాన్ని చేపడతామని, గోడౌన్లను బద్దలు కొట్టి ధాన్యాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

?అభివృద్ధి పేరిట పేదల భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, దేశవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల అసైన్డ్, పేదల భూములను ధనవంతులకు, కంపెనీలకు కట్టబెట్టారని ఆరోపించారు . ఆంధ్రప్రదేశ్‌లో 10 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను 22ఏ నిషేధిత జాబితా నుండి తొలగించి వేలం వేస్తుంటే, తెలంగాణలో 22ఏ పేరుతో సామాన్యుల భూములను చేర్చి వేధిస్తున్నారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ప్రభుత్వం ఎవరెవరికి భూములు పంచిందో ఆ వివరాలను గ్రామసభల్లో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు . సమగ్ర భూపంపిణీ చేయకుండా, అసైన్డ్ భూములకు రక్షణ కల్పించకుండా పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

రైతు సభల్లో భాగస్వామ్యం

నల్గొండలో ఈ నెల 15 నుంచి జరుగుతున్న అఖిల భారత రైతు సంఘం మహాసభలకు వ్యవసాయ కార్మిక సంఘం సంపూర్ణ భాగస్వామ్యం వహిస్తుందని వెంకట్ తెలిపారు. తెలంగాణ నుండి దాదాపు లక్ష మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఈ మహాసభకు తరలివస్తారని వివరించారు . దేశంలో 20 శాతం ఉన్న సంపన్న వర్గాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, భూములను, యంత్రీకరణను శాసిస్తుంటే, 80 శాతం ఉన్న సామాన్య రైతాంగం, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు . ఈ 80 శాతం ప్రజలను ఏకం చేసి పోరాటాలు నిర్మించడమే ఈ మహాసభల ముఖ్య ఉద్దేశమని, ఈ మహాసభల ప్రచారం కోసం ఈ నెల 5 వ తేదీ నుండి 10 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార జాతాలు, సభలు, ఉపాధి హామీ కేంద్రాల వద్ద ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు . ఉపాధి హామీ పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని, 'జీ రామ్‌జీ' పద్ధతి వద్దని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు . సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజువారీ కూలీ రూ. 600గా నిర్ణయించాలని, పట్టణ ప్రాంతాలకు కూడా ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 14 నుండి బెంగళూరులో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత మహాసభలు

రాబోయే ఫిబ్రవరి 14 నుండి 17 వరకు కర్ణాటకలోని బెంగళూరులో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత మహాసభలు జరగనున్నాయని, ఇందులో దేశవ్యాప్తంగా 1,000 మంది ప్రతినిధులు పాల్గొంటారని వెంకట్ వెల్లడించారు.

ఈ విలేకరుల సమావేశంలో

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం వెంకటేశ్వరరావు, సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి ఎర్రా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, ఖమ్మం డివిజన్ కార్యదర్శి పడిగల నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సారంగి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రవళిక మృతికి సంతాపం

ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి పట్ల అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని ప్రకటించింది. ఇటువంటి దురదృష్టకరమైన ఘటనలు అత్యంత బాధాకరమని, క్షమించరానివని పేర్కొంటూ, బాధిత కుటుంబానికివెంకట్ సానుభూతి తెలిపారు . సమాజంలోనూ, పనిప్రాంతాల్లోనూ కార్మికులపై పెరుగుతున్న దాడుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కార్మికులకు ఎలాంటి అభద్రతా భావం కలగకుండా, వారి రక్షణకు ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక శ్రేయస్సు పట్ల ప్రభుత్వాలు చూపుతున్న నిర్లక్ష్య వైఖరి ఏమాత్రం తగదని వెంకట్ అన్నారు.

పట్టభద్రులకు ఊరట
తెలంగాణలో ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువు పొడిగింపు

ఆన్‌లైన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలతో ఈసీ నిర్ణయం

నామినేషన్ల చివరి తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం

నవంబర్ 25న ముసాయిదా, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువును ఎన్నికల సంఘం పొడిగించింది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల అర్హులైన పట్టభద్రులు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు తమ ఓటును నమోదు చేసుకునే అవకాశం లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గాలకు ఈ గడువు పొడిగింపు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా సర్వర్ సమస్యల కారణంగా ఆన్‌లైన్ పోర్టల్ మొరాయించడంతో, పలు రాజకీయ పార్టీలు, పట్టభద్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి దరఖాస్తులకు నవంబర్ 6 ఆఖరి తేదీ అయినప్పటికీ, తాజా పరిస్థితుల దృష్ట్యా ఆ గడువును పొడిగించారు.అయితే, ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని అధికారులు స్పష్టం చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. దీనిపై నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరిస్తారు. అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.

కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీళ్లివ్వడం లేదు: వేముల ప్రశాంత్ రెడ్డి

మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం

ప్రస్తుత కరవు ప్రభుత్వ సృష్టేనని ఆరోపించిన వేముల ప్రశాంత్‌రెడ్డి

వెంటనే నీటిని విడుదల చేయకపోతే రైతు పోరుబాట తప్పదని హెచ్చరిక

తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన కరవని ఆయన విమర్శించారు. పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో కూడిన ప్రతినిధి బృందం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది. ఈ సందర్భంగా బ్యారేజీ స్థితిగతులను, నీటి లభ్యతను వారు పరిశీలించారు. అనంతరం వేముల ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. బ్యారేజీ వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఉద్దేశపూర్వకంగా సముద్రం పాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యం సుమారు 22,000 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని, ఈ నీటిని పంపింగ్ చేస్తే రైతుల పంటలను కాపాడవచ్చని ఆయన అన్నారు. బ్యారేజీ కూలిపోయిందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, 85 పిల్లర్లు పటిష్ఠంగానే ఉన్నాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున 'రైతు పోరుబాట' నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఇద్దరు పిల్లల నిబంధనపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

సంతానోత్పత్తి రేటు 2.1 కంటే దిగువకు తగ్గినట్లు గుర్తుచేసిన కోర్టు

వృద్ధుల జనాభా పెరుగుదలపై కోర్టు ఆందోళన

మూడో సంతానంతో అనర్హతకు గురైన మాజీ సర్పంచ్‌కు ఊరట

ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లలకు మించి ఉండకూడదనే నిబంధన ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతవరకు సమంజసమని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశంలో సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించే చట్టాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. గత రెండు దశాబ్దాల్లో దేశ జనాభా పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని బుధవారం విచారణ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం భారతదేశ మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2.1 అనే ప్రత్యామ్నాయ స్థాయి కంటే దిగువకు పడిపోయిందని గుర్తుచేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే దశాబ్దాల్లో వృద్ధుల జనాభా పెరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం ఇప్పటికీ అవసరమా? అని ప్రశ్నించింది. మహారాష్ట్రలోని కాకోడా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మంగళ భీమ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. మూడో సంతానం జన్మించడంతో ఆమెను ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హురాలిగా ప్రకటించారు. ఆమె అప్పీల్‌ను అనుమతించిన సుప్రీంకోర్టు, అనర్హత నిర్ణయాన్ని రద్దు చేసింది. ఇదే అంశంపై 2003లో వెలువడిన జావేద్ వర్సెస్ హర్యానా రాష్ట్రం తీర్పును కూడా సుప్రీంకోర్టు పునఃపరిశీలనకు స్వీకరించింది. ఆ తీర్పును విస్తృత ధర్మాసనానికి నివేదించింది. హర్యానా పంచాయతీరాజ్ చట్టం-1994 ప్రకారం ఇద్దరికి మించి పిల్లలున్నవారు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులని అప్పట్లో ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం సమర్థించింది. 2003లో ఆ తీర్పు వెలువడినప్పుడు దేశంలో ఒక్కో మహిళకు సగటున ముగ్గురు పిల్లలు ఉండేవారని, జనాభా నియంత్రణ ప్రధాన విధానపరమైన అంశంగా ఉండేదని ప్రస్తుత ధర్మాసనం గుర్తుచేసింది.

కూటమి పార్టీల మధ్య ఘర్షణ.. టీడీపీ వర్గాలపై జనసేన శ్రేణుల దాడి!

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అనకాపల్లి జిల్లా యలమంచిలిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికార కూటమిలోని టీడీపీ, జనసేన వర్గాల మధ్య విభేదాలు బయటపడ్డాయి. యలమంచిలి మున్సిపాలిటీలోని 29వ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి స్వల్ప మెజారిటీతో విజయం సాధించడంతో వివాదం మొదలైంది. టీడీపీ వర్గాలు వైసీపీ అభ్యర్థికి మద్దతు ఇచ్చాయంటూ జనసేన శ్రేణులు ఆరోపణలు చేస్తూ ఘర్షణకు దిగాయి. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కూటమి పార్టీల మధ్య నెలకొన్న ఈ వివాదం స్థానికంగా రాజకీయ చర్చకు దారితీసింది. యలమంచిలి మున్సిపాలిటీలోని 29వ వార్డులో మొత్తం 1,046 ఓట్లు పోలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఒమ్మి జగదీష్‌కు 499 ఓట్లు రాగా.. జనసేన అభ్యర్థికి 486 ఓట్లు వచ్చాయి. కేవలం 13 ఓట్ల తేడాతో వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు. ఈ ఫలితంపై జనసేన వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. టీడీపీ వర్గాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మద్దతు ఇచ్చాయని ఆరోపిస్తూ జనసేన కార్యకర్తలు టీడీపీ శ్రేణులతో వాగ్వాదానికి దిగాయి. ఈ క్రమంలో టీడీపీ వర్గాలకు చెందిన వారి ఇళ్లపై రాళ్లతో దాడి చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.




మళ్లీ సినిమాల్లోకి రానుందా?

ప్రయత్నిస్తే అసాధ్యమేదీ కాదు. నిరంతర కృషి ,పట్టుదలతో అనుకున్నది సాధించిన వారు చాలామంది ఉన్నారు. నటి నమితని కూడా ఈ కోవాలోకి చేర్చొచ్చు. రెండు దశాబ్దాల క్రితం అంటే 2001 ప్రాంతంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ భామ.. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో నటించి క్రేజీ తెచ్చుకుంది. గ్లామరస్ పాత్రలతో ప్రత్యేకత చాటుకుంది. తర్వాత కొన్నాళ్లకు బిగ్‌బాస్‌లో కలిసిన వీరేంద్ర చౌదరిని పెళ్లి చేసుకుంది. వివాహం తర్వాత బరువు పెరగడంతో ఈమెకు అవకాశాలు తగ్గిపోయాయి. అలాంటి పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వెళ్లింది. ప్రస్తుతం బీజేపీలో యాక్టివ్‌గా ఉంటోంది. రీసెంట్ టైంలో తరచూ తన ఫొటోలని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ లైవ్‌లో ఉండే ప్రయత్నం చేస్తోంది. తాజాగా ప్రముఖ యూట్యూబర్ డీజే సిద్ధు దర్శకత్వం వహిస్తున్న డయంకరం చిత్రంలో నమిత ఓ కీలక పాత్ర చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకప్పుడు బొద్దుగా కనిపించిన ఈ బ్యూటీ.. ఇప్పుడు బరువు తగ్గి స్లిమ్‌గా కనిపిస్తోంది. అలా ఆమె జిమ్‌లో కసరత్తులు చేస్తున్న ఒక వీడియోని తన ఇన్ స్టాలో పోస్ట్ చేసింది. దీనిని చూసిన నెటిజన్లు.. ఈమె నమితేనా అని ఆశ్చర్యపోతున్నారు.

భోగి'లో అనుపమ డబ్బింగ్ అద్భుతం..



యంగ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో, దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'భోగి'. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న అనుపమ పరమేశ్వరన్‌పై దర్శకుడు సంపత్ నంది ప్రశంసల వర్షం కురిపించారు. సినిమాలోని తన పాత్రకు అనుపమ సొంతంగా డబ్బింగ్ చెప్పడమే కాకుండా, అత్యంత కష్టమైన యాసను కూడా అద్భుతంగా పలికిందని కొనియాడారు. సోమవారం, అనుపమ డబ్బింగ్ చెబుతున్న ఒక వీడియో క్లిప్‌ను సంపత్ నంది తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "1960ల నాటి గ్రామీణ యాసలో డబ్బింగ్ చెప్పడం అంత సులభం కాదు. కానీ, అనుపమ చాలా సునాయాసంగా చేసి చూపించింది. కందుల సులోచన రాణి అద్భుతం" అంటూ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని నవంబర్ 12న విడుదల చేయనున్నట్లు కూడా ఆయన స్పష్టం చేశారు. 'భోగి' చిత్రంలో అనుపమ 'కందుల సులోచన రాణి' అనే ఒక విభిన్నమైన పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన ఆమె క్యారెక్టర్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. గ్రామీణ యువతిగా, కాళ్లకు చెప్పులు లేకుండా మట్టి దారిలో నడుస్తూ, తలపై మోదుగ ఆకులతో నిండిన బుట్టతో కనిపించిన ఆమె లుక్ పాత్రపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో ఆమె ప్రకృతితో మమేకమై జీవించే, మోదుగ ఆకులతో విస్తరాకులు కుట్టి జీవనం సాగించే మహిళగా కనిపించనుందని సమాచారం. 1960ల నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఓ కల్పిత గ్రామంలో జరిగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా 'భోగి' రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాలో శర్వానంద్ 'గంగ' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తుండగా, డింపుల్ హయతి మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైనర్‌గా, కిశోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రాఫర్‌గా, భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో నవంబర్ 12న పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



పడమట వీధి జానకి

'పవర్ పేట'లో పడమట వీధి జానకిగా మారిపోయారు రితికా నాయక్. సందీప్ కిషన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'పవర్ పేట'. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఇప్పటికే 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. మంగళవారం రితికా నాయక్ బర్త్ డే సందర్భంగా 'పవర్ పేట'లోని పడమట వీధి జానకి అనే పాత్రలో ఆమె నటిస్తున్నట్లు వెల్ల డించి, ఈ పాత్ర తాలూకు గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ వీడియోలో డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించారు రితిక. "ప్రేమ, గౌరవం, రాజకీయం వంటి అంశాల కలయికతో ఈ సినిమా కథ ఉంటుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ.

మహానటికి జాతీయ అవార్డు.. అయినా ఆరు నెలలు ఖాళీగానే: కీర్తి

2018లో వచ్చిన 'మహానటి'లో సావిత్రి పాత్రలో నటించి మెప్పించింది కీర్తి సురేశ్. ఈ సినిమాతో ఆమె నటనకు జాతీయ ఉత్తమ నటి అవార్డు లభించింది. అయితే ఆ సినిమా తర్వాత ఆరు నెలల పాటు ఖాళీగా ఉండిపోయిందట. ఆ సమయంలో ఎదురైన ఆర్థిక ఇబ్బందులు, ?తనకు అవకాశాలు రాకపోవడానికి కారణమేంటో తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. దర్శకనిర్మాతలు గందరగోళానికి గురయ్యారు 'మహానటి' తర్వాత నాకు ఎలాంటి పాత్రలు ఇవ్వాలనే విషయంలో దర్శకనిర్మాతలు గందరగోళానికి గురయ్యారు. అంతకుముందులా నన్ను చూడలేకపోయారు. దీంతో కొత్త అవకాశాలు రాలేదు. అందుకే ఆ సమయంలో శరీరంపై శ్రద్ధ పెట్టడంతో పాటు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారించా. అయితే 2013 నుంచి 2018 వరకు షూటింగ్, తినడం, నిద్రపోవడం.. ఇదే తన దినచర్యగా ఉండేది. అప్పట్లో వ్యాయామం గురించి అసలు ఆలోచించేదాన్ని కాదు. నా ముఖమే అవకాశాలు తెచ్చిపెడుతున్నప్పుడు శరీరం గురించి ఎందుకు ఆలోచించాలనే భావన ఉండేది. ఆ తర్వాత ఆరోగ్యంగా ఉండటమే ముఖ్యమని తెలుసుకున్నాను. అయితే ఆ సమయంలో కాస్త ఆర్థికంగా ఇబ్బందులు వచ్చేవి' అని వెల్లడించింది.

'అక్క'తో ప్రేక్షకుల ముందుకు..

ప్రస్తుతం కీర్తి సురేశ్ నటించిన 'అక్క' వెబ్ సిరీస్ విడుదలకు సిద్ధమైంది. రాధికా ఆప్టే కీలక పాత్రలో నటించిన ఈ సిరీస్ అక్టోబర్ 30న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. 'మహానటి'తో తన నటనలోని మరో కోణాన్ని చూపించిన కీర్తి.. ఇప్పుడు ఎలాంటి పాత్రతో ప్రేక్షకులను అలరిస్తుందో చూడాలి. మరోవైపు 'జనవరి 12 విడుదల' సినిమాలోనూ నటిస్తోంది.

సౌందర్య గురించి చెబుతూ కన్నీటిపర్యంతమైన నటి ఆమని

దివంగత నటి సౌందర్యను తలుచుకుని సీనియర్ నటి ఆమని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో, సౌందర్యతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. సౌందర్య అందం, వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ, ఆమె జీవితంలో ఎదుర్కొన్న ఒంటరి పోరాటాన్ని వివరించారు. "చాలామంది ముఖానికి మేకప్ వేస్తేనే తెరపై అందంగా కనిపిస్తారు. కానీ సౌందర్య మాత్రం ఎలాంటి మేకప్ లేకపోయినా అచ్చం దేవతలా ఉండేది. ఆమె నిజంగానే ఓ దేవత. అంత అందంగా ఉండేది కాబట్టేనేమో, ఆ దేవుడు కూడా అంత తొందరగా ఆ దేవతల్లోనే కలిపేసుకున్నాడు" అంటూ ఆమని కన్నీటిపర్యంతమయ్యారు. సినీ రంగంలో ఉన్నప్పటికీ, "'నేను ఇలాగే ఉంటాను.. నాకంటూ ఒక పద్ధతి ఉంది' అని ఒక గిరి గీసుకుని ఉండేది" అని ఆమని తెలిపారు. సౌందర్య ఎంతో అమాయకురాలని, ఆమె వ్యవహారాలన్నీ తొలుత ఆమె తండ్రి, ఆయన మరణం తర్వాత అన్నయ్య చూసుకునేవారని ఆమని గుర్తుచేసుకున్నారు. కష్టపడి కోట్లు సంపాదించినా, భర్త, పిల్లలతో సంతోషంగా జీవించాలనే తన కలలు నెరవేరకుండానే వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల బెంగళూరులోని సౌందర్య ఇంటికి వెళ్లానని, ఒకప్పుడు కళకళలాడిన ఆ ఇల్లు పాడుబడినట్టు కనిపించడంతో తన గుండె తరుక్కుపోయిందని ఆమని చెప్పారు. దక్షిణాది ప్రేక్షకులచే మహానటిగా కీర్తించబడిన సౌందర్య, చిన్న వయసులోనే హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.